
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 5 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	132
డ్రెస్	192
స్కిన్‌లెస్	220
గుడ్డు డజన్	66

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	24.4

వీధి వ్యాపారులకో వీధి

● మిర్యాలగూడలో ఏర్పాటుకు ప్రయత్నాలు

వ్యాపార కేంద్రమైన మిర్యాలగూడలో రద్దీ పెరుగుతుండటంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్ని వర్గాల నుంచి సేకరించిన అభిప్రాయాల ప్రకారం పట్టణంలో వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా ఓ వీధిని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

6



యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో సిద్ధమవుతున్న సీఎం బహిరంగ సభా వేదిక

రేపు యాదాద్రి జిల్లాలో

సీఎం పర్యటన

తుర్కపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న యాదాద్రి జిల్లాలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల అనంతరం తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామంలో సభలో పాల్గొననున్నారు. అందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.1,500కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారు. భువనగిరి-గజ్వేల్ రహదారి పక్కన ఐదెకరాల విస్తీర్ణంలో సభా వేదికతోపాటు ప్రజలు కూర్చోవడానికి వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా పార్కింగ్ స్థలాలకోసం అదనంగా మరో 20ఎకరాలు కేటాయించారు. సభా ప్రాంగణానికి రెండు వైపులా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

నెల ముందుగా సాగర్‌కు కృష్ణమ్మ!

6

చెక్‌డ్యామ్ ఇసుకపై

మాఫియా కన్ను



కనగల్ మండలం బంటువారిగూడెం చెక్‌డ్యాం వద్ద ఇసుక మేటలు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

- 2లక్షల క్యూబిక్‌మీటర్ల మేర తరలించేందుకు ప్రయత్నాలు
- పెద్దవాగుపై నాలుగుచోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు
- నిర్మాణాల వద్ద 8 అడుగుల మేర ఇసుక నిల్వలు ఉండాలంటున్న నిపుణులు
- అప్పుడే భూగర్భజలాల పెరుగుదల, స్థిరత్వం
- మాఫియా యత్నాలు అడ్డుకోవాలంటున్న రైతాంగం
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని విన్నపం



నల్లగొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌ల ప్రయోజనాలకు గండి కొట్టేలా ఇసుక మాఫియా స్కెచ్ వేస్తోంది. చెక్‌డ్యామ్‌ల పరిసరాల వాగుల్లోని ఇసుక నిల్వలు తరలించుకుపోయేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇసుక మేటలు ఉన్నాయనే పేరుతో అనుమతులు తీసుకొని, వాగును జల్లెడపట్టాలని చూస్తుండటంతో చెక్‌డ్యామ్‌ల భద్రత ప్రశ్నార్థకంగా మారనుంది.

మండల స్థాయిలో అధికారులను, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, వాగులను పర్యవేక్షించే ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి భారీగా ఇసుకను తరలించేందుకు రంగం సిద్ధం చేస్తుండడంతో విషయాన్ని పసిగట్టిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలు పెంచేందుకు, అడ్డగోలు ఇసుక తవ్వకాలతో ఇప్పటికే స్వరూపం కోల్పోయిన వాగులకు పునర్జీవం పోసేందుకు ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాన్ని దెబ్బతీసేలా ఇసుక మాఫియా వ్యవహరిస్తుంటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ తక్షణమే స్పందించి చెక్‌డ్యామ్‌ల వద్ద నిర్ణీత ప్రాంతం వరకైనా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని రైతులు కోరుతున్నారు.

పెద్దవాగు, అహల్యవాగు ఇసుకకు మాఫియా స్కెచ్

కనగల్ నుంచి అనుముల మండలం మీదుగా ప్రవహించే పెద్దవాగుపై బంటువారిగూడెం, శ్రీనాథపురం, పాలెం గ్రామాల సమీపంలో మూడు చోట్ల, అనుముల మండల కేంద్ర సమీపంలోని అహల్యవాగుపై మరో చోట మొత్తం నాలుగు చెక్‌డ్యామ్‌లను ఒక్కోటి సుమారు రూ.7కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. అడ్డగోలు ఇసుక తవ్వకాలతో ఇప్పటికే స్వరూపం కోల్పోయిన వాగుకు పునర్జీవం పోయడంతోపాటు వాగు పరిసరాల్లో భూగర్భజలాలను సంరక్షించడానికి, వర్షాలు, వరదల సమయంలో నీరు ఇంకేందుకు వీలుగా ఈ చెక్‌డ్యామ్‌లను ఇరిగేషన్‌శాఖ నిర్మిస్తోంది. వాగుకు అడ్డంగా పూర్తిగా కాంక్రీట్ కట్ట వేయడంతో పాటు, కట్టకు వెనకవైపున సైతం కొంతమేర కాంక్రీట్ నిర్మాణాలు, మట్టికట్టలు నిర్మిస్తారు. ఈ చెక్‌డ్యామ్‌లు నిర్మించిన చోట వాగుల్లో కనీసం కిలోమీటరన్నర నుంచి రెండు కిలోమీటర్ల వరకు నీరు నిల్వ ఉండడమే గాక ఆ ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు నీటి వేగాన్ని నియంత్రిస్తాయి. తద్వారా నీరు వీలైనంతమేర భూమిలో ఇంకుతుంది. దీంతో వాగు పరివాహక ప్రాంతంలో భూగర్భజలాల్లో స్థిరత్వం ఉండడమేగాక వరద వృథాగా పోకుండా అడ్డుకుంటాయి. చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్న నాలుగు ప్రాంతాల్లో కనీసం కిలోమీటర్‌న్నర వరకు భూఉపరితలం నుంచి కనీసం 8 అడుగుల మేర ఇసుక నిల్వలు ఉండేలా చూడాలి. అక్కడ ఇసుక తవ్వకాలను నిషేధించాలి. అక్కడ ఇసుక నిల్వలుంటేనే వరద వచ్చినప్పుడు వేగ నియంత్రణ జరిగి చెక్‌డ్యామ్‌లకు రక్షణగా ఉంటుంది. ఇసుక నిల్వలు లేకపోతే వరద వేగానికి కట్టడాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంటుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అయితే చెక్‌డ్యామ్‌ల నిర్మాణ మిగతా 8వ పేజీలో...

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అమలులో భాగంగా అపరిష్కృతంగా ఉన్న రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని వెల్మగూడెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరై రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని మాట్లాడారు. ఈనెల 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సుల్లో సాదాబైనామా, పెండింగ్ మ్యుటేషన్‌లు, విస్తీర్ణంలో తప్పొప్పుల సవరణ, భాగా పంపిణీ తదితర సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. వెల్మగూడెంలో సుమారు 70వరకు దరఖాస్తులు వచ్చాయని, పాస్‌బుక్‌లో తప్పులుంటే సవరించుకోవచ్చని, పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని తెలిపారు. లావుని భూములకు పట్టా చేయడం కుదరదని, ప్రభుత్వ భూములు కొనుగోలు చేసిన వారికి సైతం క్రమబద్ధీకరించడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, హబీబ్‌అలీ, పాల్గొన్నారు.



వెల్మగూడెంలో రైతుల నుంచి దరఖాస్తు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దివ్యాంగులకు చికిత్స అందించాలి

నల్లగొండ టౌన్: దివ్యాంగులు, రక్తహీనత, నరాల బలహీనత సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి చికిత్స అందించేందుకు ముందుకు రావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఈసీఐఎల్‌కి చెందిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ వేణుబాబు, హెచ్ఆర్ మేనేజర్ దుర్గాప్రసాద్ కలెక్టర్‌ను కలిసి సామాజిక బాధ్యత కింద దివ్యాంగులకు 100 బ్యాటరీ ఆపరేటెడ్ మోటార్ సైకిళ్లు, కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. దీంతో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 52,000 మంది విభిన్న సామర్థ్యాలు (దివ్యాంగులు) కలిగిన వారు ఉన్నారని, 700 మంది చిన్నారులు మానసిక వైకల్యంతో బాధపడుతున్నారని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలతోపాటు చికిత్సకు ఈసీఐఎల్ ముందుకు రావాలని కోరారు. దేవరకొండ, మిర్యాలగూడలో మారుమూల గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని, ఇక్కడ ఎంతోమంది బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. దీంతో చీఫ్ మెడికల్ ఆఫీసర్ వేణుబాబు స్పందిస్తూ దివ్యాంగుల అవసరాలపై ప్రత్యేకంగా ప్రతిపాదనలు రూపొందించి తమకు సమర్పించాలని, రక్తహీనతను తగ్గించేందుకు బేస్ లైన్ సర్వే చేసి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. సమావేశంలో సీడీపీవో హరిత, జిల్లా సంక్షేమశాఖ కార్యాలయం ప్రోగ్రాం అధికారి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, పేపర్, వస్త్రాలతో రూపొందించిన సంచులు వినియోగించాలన్నారు. స్టీల్ బాటిళ్లు, టిఫిన్ బాక్సులు ఉపయోగించాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, పాల్గొన్నారు.

నీళ్లిచ్చి ఓట్లు అడుగుతాం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందూరు జైవీర్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నెల్లికల్ ఎత్తిపోతల పనులను పూర్తి చేసి కృష్ణపట్టి ప్రాంత రైతులకు సాగునీరందించాకే ఓట్లు అడుగుతామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నెల్లికల్ ఎత్తిపోతలతో భూములు కోల్పోయిన సుమారు 100మంది రైతులకు బుధవారం పరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లికల్ ఎత్తిపోతల పథకం జానారెడ్డి కల అని, 2013 నుంచి ఆయన దీనికోసం ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. కృష్ణా రివర్ బోర్డు నుంచి నీటి వినియోగానికి, రాష్ట్ర అటవీశాఖ అనుమతులు వచ్చేలా జానారెడ్డి కృషి చేశారన్నారు. గత రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు ఈ ఎత్తిపోతల అంశాన్ని ఓట్ల కోసమే వినియోగించుకున్నారని విమర్శించారు. సాగర్ ఉప ఎన్నికకు ముందు శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం కేసీఆర్ ఇక్కడే కుర్చీ వేసుకొని పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి ఫేజ్‌లో ఎర్రచెర్వుతండా నుంచి గోడుమడక వరకు సుమారు ఆరు గ్రామాలకు సాగునీరందించేలా నిధులను కేటాయించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ ఏర్పాటు చేసి రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు ద్వారా అర్హులుగా గుర్తించిన 5వేల మంది రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, అంగోతు భగవాన్‌నాయక్, సాగర్‌రెడ్డి, రమావత్ కృష్ణానాయక్, పమ్మి జనార్ధన్‌రెడ్డి, లాలునాయక్, బూడిద కొండలు, రమావత్ భీలునాయక్, పబ్బు గిరి, తదితరులు పాల్గొన్నారు.

కాల్వ మట్టి కాజేస్తున్నారు

● దండెంపల్లిలో మట్టి మాఫియా ఆగడాలు
● టిప్పర్లలో యథేచ్ఛగా తరలింపు

7

ఎన్జీ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల

బాస్కెట్ బాల్ జట్టుకు విహారెడ్డి

7



బేబీ వార్మర్‌లో శిశువును పరీక్షిస్తున్న వైద్యుడు రామకృష్ణ, సిబ్బంది

వసతులు పెరిగాయి..

ప్రసవాలూ పెరిగాయి

కనగల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కనగల్ పీహెచ్‌సీలో మౌలిక వసతులు పెరగడంతో సాధారణ ప్రసవాలు పెరిగాయి. గతంలో ఆస్పత్రిలో నెలకు ఒక ప్రసవం జరగ్గా, ప్రస్తుతం 10 వరకు సాధారణ ప్రసవాలు అవుతున్నాయి. కనగల్ పీహెచ్‌సీకి ప్రభుత్వం రూ.1.50కోట్లతో నూతన భవనాన్ని నిర్మించగా, మూడు నెలల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన హామీ మేరకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఆస్పత్రికి అవసరమైన ఆధునిక పరికరాలు సమకూరాయి. బేబీ వార్మర్, ఆటోక్లేవ్, ఫెటల్ డాప్లర్, నెబ్యులైజర్ తదితర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టిసారించి ఆస్పత్రికి ఫర్నిచర్, ఇతర సామగ్రి, మౌలిక వసతులను సమకూర్చారు. దీంతోపాటు జిల్లాలోనే ప్రప్రథమంగా గ్లకోమా కంటి పరీక్షల కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుచేశారు. దీంతోపాటు పీహెచ్‌సీ వైద్యుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకునేలా ప్రోత్సహించారు. పేద మహిళలు ప్రసవిస్తే వైద్యులతోపాటు, సిబ్బంది బాలింతలకు చీర, పుట్టిన శిశువుకు రెండు జతల దుస్తులు సమకూరుస్తున్నారు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డను సురక్షితంగా ఆస్పత్రి నుంచి ఇంటికి చేర్చుతున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే గర్భిణుల సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కృషిని కలెక్టర్ ప్రశంసించారు.

దేశంలో ఆర్థిక అసమానతల పెరుగుదల

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మిర్యాలగూడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో రోజురోజుకూ ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మండల పరిధిలోని యాద్గార్‌పల్లిలో జరిగిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో పాలకులు అనుసరిస్తున్న అసమగ్ర విధానాలతో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయన్నారు. పేదరికం పెరిగి చాలామంది జీవించే హక్కును కోల్పోతున్నారని అన్నారు. అధికారం కోసం పాకులాడే పాలకవర్గాలు ధనిక, సంపన్న వర్గాల మెప్పు పొందేందుకు ప్రజా సంపదను దోచిపెడుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలిచ్చి, సహజ వనరుల దోపిడీకి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని విమర్శించారు. పేదలు ఎర్రజెండా నీడన సంఘటితమవుతున్నారని అన్నారు. అసమానతలు లేని సమాజం కోసం, దోపిడి, పీడనలు లేని సమసమాజం కోసం పేదలు ఎర్రజెండాను ఎత్తి పట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి.సయీద్, దామరచర్ల, వేములపల్లి మండలాల కార్యదర్శులు లింగానాయక్, జిల్లా యాదయ్య, బిళ్ల కనకయ్య, బంటు రాజేశ్వరీ, రామలింగం, జి.యాదగిరి, పద్మ, శాంత, వలపట్ల వెంకన్న, మట్టయ్య, ముత్తు, జగన్, సైదమ్మ, రమేష్, రాములు, మార్తమ్మ, అనిత, లక్ష్మి, ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

బీసీలు సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



సమాశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బీసీలు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాడాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లు ప్రకటించాకే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. అనంతరం ఎస్‌బీఐ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్‌వీటీని బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నూనె వెంకటేష్, అబ్దుల్లా, ఖాదర్‌బాబా, లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

● జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గాలికి వది రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పాకులాడుతున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మత విద్వేషాలను సృష్టిస్తోందని ఆరోపించారు. కశ్మీర్‌లో పర్యాటకులపై దాడి చేసి 27 మందిని చంపిన నలుగురు ఉగ్రవాదులను ఇంతవరకు పట్టుకోలేదని విమర్శించారు. దేశ ప్రజలంతా యుద్ధం కోరుకుంటుంటే ట్రంప్ చెప్పాడని యుద్ధాన్ని ఆపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. యుద్ధంపై అఖిలపక్షం సమావేశం నిర్వహించాలన్నారు. ఎన్నికల ముందు ఆరు పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లో ఎవరికి వారే వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యలపై ఎర్రజెండా ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు పాలడుగు నాగార్జున, డబ్బికార్ మల్లేష్, నారి ఐలయ్య, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

క్రైం పాయింట్ Crime point

పైన ఎండు గడ్డి మోపులు.. కింద ఆవులు

● కొత్త తరహాలో ఆవుల అక్రమ రవాణా



ట్రక్కు చుట్టూ గడ్డిమోపులు, మధ్యలో కనిపించకుండా ఆవులు



భువనగిరి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆవుల అక్రమ రవాణాదారులు ప్రతిసారి ఓ కొత్త విధానాన్ని అవలంబిస్తున్నారు. రెండు వారాల క్రితం పైన కొబ్బరి పీచు బస్తాలు దిగువన కట్టివేసిన ఆవులను అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఘటన మరువకముందే మరో మారు ఎండు గడ్డిమోపుల కింద ఆవులను దాచి రవాణా చేస్తూ బుధవారం గోరక్షకుల చేతికి చిక్కారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రవాణా ట్రక్కు వాహనంలో అడుగు భాగంలో 17 ఆవులను కట్టివేసి, పైన ఎండుగడ్డి మోపులను పేర్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రంపచోడవరం నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు గోరక్షకులు భువనగిరి బైపాస్ రోడ్డుపై వేచిఉన్నారు. బజరంగ్‌దళ్ జిల్లా, పట్టణ కన్వీనర్లు బింగి భరత్, నవీన్ తదితరులు ద్విచక్ర వాహనాలపై ట్రక్కును అనుసరించి స్థానిక సింగన్నగూడెం చౌరస్తాలో నిలిపారు. ఎండుగడ్డి మోపుల కింద ఆవులను గురించి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆవులను రాజాపేట మండలం చల్లూరు గోశాలకు తరలించామని, వాహనాన్ని సీజ్ చేసి యజమాని రాజు పత్లావత్, డ్రైవర్ మధు, క్లీనర్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో కోర్టు ఇద్దరికి జైలు, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీన సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 10 మంది మోతాదుకు మించి మద్యం తాగినట్లు గుర్తించామన్నారు. వారిని బుధవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి బీవీ రమణ ఒకరికి మూడు రోజుల జైలుతో పాటు రూ.2 వేల జరిమానా, మరొకరికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు. మిగిలిన ఎనిమిది మందికి కలిపి రూ.9 వేల జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

త్రిపురారం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పలుగు గ్రామంలో విద్యుదాఘాతంతో బుధవారం మూడు గేదెలు మృతి చెందాయి. బాధితులు రెబెల్లి సైదులు, గొల్ల ఉపేంద్ర తెలిపిన వివరాల ప్రకారం పాడి గేదెలు ఉదయం పొలంలో మేత మేస్తూ కింద పడి ఉన్న విద్యుత్ వైర్లకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రెబెల్లి సైదులుకు చెందిన రూ.2 లక్షల విలువైన రెండు గేదెలు, గొల్ల ఉపేంద్రకు చెందిన రూ.లక్ష విలువైన ఒక గేదె మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.



పొలంలో గేదెల మృతదేహాలు

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తి మృతి

కోదాడ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కోదాడకు చెందిన కే రాఘవ(40) మండలంలోని నల్లబండగూడెం పంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనుల్లో పాల్గొన్నాడు. బుధవారం సాయంత్రం తిరిగి కోదాడకు వస్తుండగా, విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు రాఘవ బైక్‌ను ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.



రాఘవ మృతదేహం

వాహనం ఢీకొని యాచకుడు ..

నాగార్జునసాగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం వారం రోజులుగా పైలాన్‌కాలనీలో తిరుగుతూ బిక్షాటన చేస్తున్న 70 ఏళ్ల వయస్సు గల వ్యక్తి బుధవారం నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైపాస్ రోడ్డులో స్థానికులను విచారించగా యాచకుడు హిందీ మాట్లాడేవాడని తెలిసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆనవాళ్లు తెలిసిన వారు విజయపురి సౌత్ పోలీసులకు తెలపాలని ఎస్ఐ కోరారు.

చెట్టు పైనుంచి పడి ...

సూర్యాపేట క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. పట్టణ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన నగిరె సైదులు(47) సుతారీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాలనీలోని బంధువుల నివాసంలో వేపచెట్టు కొమ్మలు కొట్టేందుకువెళ్లాడు. చెట్టు ఎక్కి కొమ్మలు తొలగించే సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సైదులు కుమారుడు అనిల్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ వాసా ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇటుకులపహాడ్‌లో వృద్ధుడి అదృశ్యం

శాలిగౌరారం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా శాలిగౌరారం ఎస్ఐ సైదులు తెలిపారు. మండలంలోని ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన కుంచం రామచంద్రయ్య(69) అలియాస్ బాబు మే 15న ఇంటి నుంచి అదృశ్యమైనట్లు తెలిపారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో కుమారుడు వెంకన్న ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670178, 8712667713 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ సైదులు కోరారు.



రామచంద్రయ్య(ఫైల్‌ఫొటో)

బిర్యానీ ఇవ్వలేదని ఓ వ్యక్తి వీరంగం : కేసు నమోదు

సూర్యాపేట అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బిర్యానీ కోసం హోటల్ నిర్వాహకులను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా చివ్వెంల ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చివ్వెంల మండలం అక్కలదేవిగూడెంలోని ఓ దాబా హోటల్‌కు మే 30వ తేదీ సాయంత్రం ఆరు గంటల సమయంలో అదేగ్రామానికి చెందిన అబ్బులుగౌడ్ తన అనుచరుడికి నాలుగు బిర్యాని ప్యాకెట్లు తెమ్మని పంపించాడు. డబ్బులు ఇచ్చి బిర్యాని తీసుకెళ్లాలని హోటల్ నిర్వాహకురాలు తెలిపింది. తాను అబ్బులుగౌడ్ మనిషినంటూ వెంటనే అతడికి ఫోన్‌చేసి విషయం చెప్పాడు. బైకుపై హోటల్‌కు వచ్చిన అబ్బులుగౌడ్ దాబా ముందు బైకును పడేసి ఆగ్రహంతో హోటల్ నిర్వాహకురాలిపై చేయి చేసుకున్నాడు. ఈ మేరకు హోటల్ నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా అబ్బులుగౌడ్ ఎవరో నీకు తెలుసా అంటూ వీరంగం సృష్టించిన తతంగం అంతా హోటల్ సీసీ కెమెరాలో రికార్డయ్యింది.



హోటల్ నిర్వాహకులతో వాగ్వాదం చేస్తున్న అబ్బులుగౌడ్

నెల ముందుగా సాగర్‌కు కృష్ణమ్మ!


● జూరాల నుంచి శ్రీశైలానికి మొదలైన నీటి విడుదల ● గతంలో ఎన్నడూ లేనివిధంగా జూన్‌లోనే ● సాగర్ ఆయకట్టుకు జూలైలోనే

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఈ ఏడాది రెండు నెలల ముందుగానే కృష్ణమ్మ రానుందా? అంటే నీటిపారుదల శాఖ నిపుణులు అవుననే చెబుతున్నారు. గతంలో కృష్ణ పరివాహక ప్రాంతాల్లో జూన్‌లో వర్షాలు కురిస్తే సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులు అన్నినిండిన తర్వాత జూలైలో సాగర్‌కు వరద రాక ప్రారంభమయ్యేది. ప్రస్తుతం సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల నుంచి వరద రాక రెండు నెలల ముందుగానే ప్రారంభమైంది. జూరాల గరిష్ట నీటిమట్టం 318.81 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.55 మీటర్లుగా ఉంది. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటిలో 16,732 క్యూసెక్కులను దిగువన ఉన్న శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 833.90 అడుగులుగా ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జూన్‌లోనే శ్రీశైలానికి జూరాల నుంచి నీటి విడుదల ప్రారంభం కావడంతో సాగర్ ప్రాజెక్టుకు నీటి రాక ముందే వస్తుందని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే జూన్ చివరి నాటికి వరదరాక ప్రారంభం కావచ్చునని ఆయకట్టు రైతులు, ప్రాజెక్టు అధికారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590(312.5050 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 511.80(134.7466టీఎంసీలు)అడుగులుగా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 4,050 క్యూసెక్కులు, ఎడమ కాల్వ, వరద కాల్వ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదల లేదు. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 4,500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు.



నాగార్జునసాగర్‌లో బుధవారం సాయంత్రం నాటికి నీటినిల్వ

ఐదేళ్లలో ఆగస్టులోనే క్రస్ట్‌గేట్లు ఎత్తివేత

సాగర్ క్రస్ట్‌గేట్లను 2019 నుంచి 2024 వరకు ఆగస్టులోనే ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

ఏడాది	క్రస్ట్‌గేట్లు ఎత్తిన తేదీ	నాటి నీటిమట్టం (అడుగుల్లో)
2019	ఆగస్టు 12	588.00
2020	ఆగస్టు 21	585.40
2021	ఆగస్టు 01	587
2022	ఆగస్టు 11	585.60
2023	గేట్లు ఎత్తలేదు.	
2024	ఆగస్టు 5	585.20

ప్రతీ ఏడాది ఆగస్టులోనే ...

ప్రతీ ఏడాది సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు ఆగస్టులోనే సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో 2023-24 వ్యవసాయ సంవత్సరాన్ని రాష్ట్ర ప్రభుత్వం క్రాప్ హాలిడేగా ప్రకటించింది. దీంతో ఆ ఏడాది సాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ ఆయకట్టులో బోర్లు, బావుల కింద సుమారు లక్ష ఎకరాలు మాత్రమే సాగు చేశారు. సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వ పరిధిలో నల్లగొండ, ఖమ్మం జిల్లాలో సాగవుతున్న ఆరు లక్షల ఎకరాలు సాగునీరు లేక పోవడంతో 2023 వ్యవసాయ సంవత్సరంలో బీళ్లుగా మారాయి. 2024-25 వ్యవసాయ సంవత్సరంలో సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక జూలైలో ప్రారంభం కావడంతో ఆగస్టు 2వ తేదీ నుంచి ఎడమ కాల్వకు వానాకాలం సాగుకు నీటిని విడుదల చేశారు.

వానాకాలం సీజన్‌లో పదేళ్లలో ఎడమకాల్వకు విడుదల వివరాలు

ఏడాది	నాటి నీటిమట్టం (అడుగులు)	నీటి విడుదల తేదీ
2014	515	ఆగస్టు 6
2015	510	నీటివిడుదల లేదు
2016	514.20	ఆగస్టు 26
2017	576	అక్టోబరు 31
2018	555	ఆగస్టు 23
2019	556	ఆగస్టు 11
2020	556	ఆగస్టు 7
2021	585	ఆగస్టు 5
2022	555	ఆగస్టు 31
2023	506	క్రాప్ హాలిడే
2024	585	ఆగస్టు 2

క్లిక్ క్లిక్ click



శిథిలావస్థకు చేరిన పాతబస్తీలోని ప్రభుత్వ పాఠశాల భవనం



పాతబస్తీలో 75 ఏళ్ల నాటి పాత భవనం

పురాతన భవనాలతో భయం భయం

నల్లగొండ పట్టణం పాతబస్తీలో 80 నుంచి 100 ఏళ్ల నాటి భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొన్ని భవనాలు సగం కూలిపోయాయి. ఆయా భవనాలను పూర్తిగా నేలమట్టం చేయకపోవడంతో విషసర్పాలకు నిలయంగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత యజమానులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. 60 నుంచి 80 ఏళ్లనాటి భవనాలను తక్కువ అద్దెకి ఇస్తుండటంతో కొంతమంది అక్కడే ఉంటున్నారు. వర్షాకాలం సమీపించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



గంజ్‌లోని చౌరస్తాలోని పాత భవనం



100 ఏళ్ల నాటి షేర్ బంగ్లా



అధికారులతో సమీక్షలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు, ఈవో వెంకటరావు

రూ.230 కోట్ల ప్రతిపాదనలతో

అభివృద్ధి పనుల నివేదిక

సీఎంకు తిర్మలాపురం సభలో అందజేస్తాం : విప్ బీర్ల

యాదగిరిగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దర్శనార్థం దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు కొండపైన సదుపాయాల కోసం రూ.230 కోట్ల ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. కలెక్టర్ హనుమంతరావు, దేవాదాయ శాఖ కమిషనర్, ఈవో వెంకట్రావుతో కలిసి బుధవారం యాదగిరికొండపైన బుధవారం సమావేశమయ్యారు. వేద పాఠశాల, కొండపైన బాలాలయ ప్రదేశంలో కల్యాణ మండపం, కళావేదిక నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్, మల్టీలెవల్ వాహనాల పార్కింగ్, గదులు నిర్మాణం, సౌర విద్యుత్, అసంపూర్తి బ్రిడ్జి తదితరాలపై సమీక్ష నిర్వహించిన అనంతరం విప్ మాట్లాడారు. కొండపైన భక్తులకు కావల్సిన సదుపాయాల కోసం రూ.230 కోట్ల అభివృద్ధి పనులు నివేదికను ఈవో తయారు చేశారన్నారు. తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో ఈ నెల 6న జరిగే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదికను అందజేస్తామన్నారు. సీఎం ఆదేశాల మేరకు అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. తిరుమల తరహాలో యాదగిరిగుట్టను అభివృద్ధి చేయాలన్నది సీఎం లక్ష్యమన్నారు. ఆలయానికి పాలక మండలిని నియమించేందుకు సీఎం నేతృత్వంలో శరవేగంగా కసరత్తు జరుగుతోందన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్‌డీవో పీడీ నాగిరెడ్డి, ఆలయ అధికారులు దోర్బల భాస్కర శర్మ, జిల్లెల దయాకర్ రెడ్డి, ఊడెపు వెంకటరామారావు, జిల్లా, ఆలయ యంత్రాంగం పాల్గొన్నారు.

వీధివ్యాపారులకో వీధి

మిర్యాలగూడలో ఏర్పాటుకు ప్రయత్నాలు





మునిసిపల్ కాంప్లెక్స్ వద్ద రోడ్డు వెంట విక్రయాలు కొనసాగిస్తున్న వీధివ్యాపారులు, మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ఫ్లైఓవర్ ప్రాంతం

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా ఓ వీధిని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వ్యాపారకేంద్రమైన మిర్యాలగూడ పట్టణంలో రద్దీ పెరుగుతుండటంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్నివర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించిన అనంతరం సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే, మునిసిపల్ కమిషనర్, పోలీస్ యంత్రాంగం పట్టణంలో ప్రణాళిక రూపొందించి అమలు చేసేందుకు సన్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

మిర్యాలగూడ పట్టణంలో ఏకైక వాణిజ్య కూడలిగా కొనసాగుతున్న సాగర్‌రోడ్డులో తరుచుగా ట్రాఫిక్ రద్దీ నెలకొంటుంది. దానిని నివారించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొంత మేరకు రోడ్డు విస్తరణ జరిగినా వీధివ్యాపారులు తోపుడుబండ్లను రోడ్డుపక్కనే ఏర్పాటుచేసుకుని వ్యాపారాలు కొనసాగించడం, ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే నిలుపుతుండటంతో రోడ్డు మూసుకపోయి ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఈ క్రమంలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తూ తోపుడుబండ్లను పేవ్‌మెంట్ పక్కనున్న డ్రైనేజీపైకి జరిపి విక్రయాలు చేసుకోవాలని ట్రాఫిక్ పోలీస్, మునిసిపల్ అధికారులు వీధివ్యాపారులకు సూచిస్తూ వచ్చారు. కాగా డ్రైనేజిపైకి పండ్ల బండలను జరపడంతో మెయిన్‌రోడ్డు పక్కనున్న షాపులకు తోపుడు బండ్లు అడ్డంగా ఉండి గిరాకీ దెబ్బతింటుందని దుకాణయజమానులు పోలీసులకు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. దీంతో సమస్య మొదటికి వస్తోందని అధికారులు తలలపట్టుకుంటున్నారు. మరోవైపు డ్రైనేజీపై పాదచారులు నడవడానికి అవకాశం లేకుండా పోతోందంటున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికకు రూపొందిస్తున్నట్లు సమాచారం.

263 మంది వీధి వ్యాపారులు

వ్యాపారకేంద్రంగా ఉన్న సాగర్‌రోడ్డులో రాజీవ్‌చౌక్ నుంచి రైల్వేట్రాక్ వరకు 262 మంది రోడ్డు పక్కన తోపుడుబండ్లను ఏర్పాటుచేసుకుని చిరువ్యాపారాలు చేసుకుంటున్నట్లు మునిసిపల్ అధికారులు నివేదిక రూపొందించారు. మొత్తం పట్టణంలో 48 వార్డుల్లో 8,327 మంది స్ట్రీట్ వెండర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. వీరిలో వీధివ్యాపారులుగా మొదటి విడతలో 4,460 మంది రూ.10వేల రుణాలు, రెండవ విడతలో 1,748 మంది రూ.20 వేలు, మూడవ విడతలో 719 మంది రూ.50 వేల రుణాలు పొందినట్లు తెలుస్తోంది. కాగా సాగర్‌రోడ్డులోని 263 మందికి ప్రత్యేకంగా వాణిజ్య వీధిని ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చేయవచ్చునని అధికారులు భావిస్తున్నారు.

ఫ్లైఓవర్ కింద ప్రత్యేక ఏర్పాట్లు

టీఎఫ్ఐడీసీ కింద 2021లో ఫ్లైఓవర్ బ్యూటీషన్‌కు రూ.3 కోట్లు మంజూరైనట్లు సమాచారం. ఆ నిధులు వెచ్చించి వీధివ్యాపారుల విక్రయాలకు ప్రత్యేక వీధిని ఏర్పాటు చేసేందుకు మునిసిపల్ అధికారలు చర్యలు చేడుతున్నట్లు తెలుస్తోంది. ఫ్లైఓవర్ కింద ఒక వైపున వాహనాల పార్కింగ్‌కు మరో వైపున పండ్లు, కాయగూరలు, ఇతర విక్రయాలు కొనసాగించుకునేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఫ్లైఓవర్ కింద నుంచి ప్రయాణించే వాహనాలకు రాకపోకలకు అనువుగా విభజించి పైనుంచి కురిసే వర్షపునీరు వెళ్లడానికి కింద డ్రైన్ ఏర్పాటు చేసి గ్రిల్స్ అమర్చి, లైట్లు, సర్వీస్‌రోడ్డు సౌకర్యం కల్పించేలా ప్రణాళికను రూపొందిస్తున్నారు. చిరు వ్యాపారాలకు అనువైన మరో రెండు చోట్లను గుర్తించి అందరికీ అక్కడికి తరలించి పునరావాసం కల్పించడం ద్వారా పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నియంత్రణ చేయవచ్చన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నాం



సాగర్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, పోలీస్, మునిసిపల్ శాఖ సమన్వయంతో వీధి వ్యాపారుల, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాం. ఫ్లైఓవర్ కింది ప్రాంతాన్ని వాణిజ్యవీధిగా అభివృద్ధి చేసేందుకు అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. అదేవిధంగా మరో రెండు చోట్లను కూడా పరిశీలిస్తున్నాం.

ఎండీ యూసూఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

కాల్వ మట్టి కాజేస్తున్నారు..

- దండెంపల్లిలో మట్టి మాఫియా ఆగడాలు
- టిప్పర్ వాహనాల్లో యథేచ్ఛగా తరలింపు
- పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు



కాల్వ మట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహనాలు, ట్రాక్టర్లు



అది బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు సంబంధించిన కాల్వ.. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని దండెంపల్లి గ్రామ శివారు నుంచి వెళ్తుంది. ఆ కాల్వ మట్టిపై మాఫియా కన్ను పడింది. ఇంకేముంది టిప్పర్ వాహనాల ద్వారా కాల్వ మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా ఈ వ్యవహారం జరుగుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

● (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్లు అటు కట్టంగూరు మండలంలోని పిట్టంపల్లి గ్రామం నుంచి, ఇటూ నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామం నుంచి మట్టి తరలిస్తున్నారు. ఇప్పటికే నల్లగొండ చుట్టూ పక్కల కొండలు, చెరువులు, గుట్టల మట్టి తరలిస్తున్న మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఈ మాఫియాకు బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు కాల్వ వరంలా మారింది. స్థానికులు ప్రశ్నిస్తే వారిని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఒక్క టిప్పర్ మట్టిని పట్టణ ప్రాంతాల్లో రూ.4500లకు వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు ఉన్నాయి. టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్న మట్టిని పలు వెంచర్లు, నూతనంగా నిర్మాణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నాళ్లుగా ఈ దందా కొనసాగుతున్నా అధికార యంత్రాంగం స్పందించడం లేదు.

కాల్వ పటిష్టత ప్రశ్నార్థకం

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టడంతో పాటు కాల్వ పనులు త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఉంది. కొన్ని నెలల క్రితమే చాలా వరకు బి.వెల్లంల ప్రాజెక్టు పనులు నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామాన్ని దాటాయి. అయితే అక్రమార్కులు ఈ కాల్వ వెంటఉన్న మట్టి తరలిస్తుండడంతో కాల్వ పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. గతంలోనే కొంతమంది వ్యాపారులు ఆ గ్రామంలో భూములను కొనుగోలు చేసి తమ భూముల నుంచి బి.వెల్లంల కాల్వ వెళ్లకుండా, తమ భూములు నష్టపోకుండా ఉండేలా కాల్వ డిజైన్‌నే మార్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పెద్దఎత్తున మట్టి కాల్వ తరలించడంతో నీటి విడుదల తర్వాత కాల్వ కుంగిపోయే అవకాశాలు ఉంటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రైతులు పలుమార్లు నీటిపారుదల శాఖ అధికారులకు ఫోన్లు చేసినా స్పందించక పోవడం, స్వయంగా కలిసి అధికారులకు విన్నవించినా కనీసం స్పందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు తీసుకొచ్చి మట్టిని పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ తంతాగానికి పాల్పడుతున్నారు. ఈ మాఫియా గతంలోనూ నల్లగొండ చుట్టు పక్కల చెరువులు, కొండలు, గుట్టలు అనే తేడా లేకుండా మట్టి తరలించారనే ఆరోపణలు ఉన్నాయి.



రైతుల పొలాలనూ వదలని వైనం

భారీ వాహనాలు కాల్వ కట్టతో పాటు పొలాల్లో తిరుగుతుండడంతో స్థానికంగా రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కాల్వ మట్టినే కాకుండా పొలాల్లోని మట్టిని కూడా లోతుగా తవ్వుతున్నట్లు ఆరోపణలున్నాయి. మొరంతో పాటు కొన్నిచోట్ల ఎర్రమట్టి కూడా ఉండడంతో ఆ మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పొలాల్లో రైతులకు సంబంధించిన పైపులైన్‌లు పగిలి పోవడంతో రైతులు మరమ్మతులు చేసుకొని ఆర్థిక భారం మోస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నట్లు సమాచారం. విలువైన మట్టి తరలించడంతో భూసారం తగ్గి, నీటి నిల్వలు అడుగంటి పోయే ప్రమాదం ఉంది. పట్టా భూముల్లో సైతం మట్టి తవ్వుతున్నట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక నీటిపారుదల శాఖ ఈఈ, డీఈలను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరడానికి ప్రయత్నించి నప్పటికీ ఫోన్ ఎత్తడం లేదు. తక్షణమే తరలింపును నిలిపివేయకుంటే ఆందోళన చేస్తామని స్థానిక రైతులు శ్రీనివాస్, లింగయ్య, రమేష్, లక్ష్మయ్య స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా మట్టి తరలింపును నిలిపివేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.80 అడుగులు
టీఎంసీలు	134.7466
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	4,050
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	4,500 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	25.10 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.10 అడుగులు
టీఎంసీలు	3.24
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	357. 40క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	76.40 క్యూసెక్కులు

క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే వీరేశం



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జూన్ 4, (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద చేస్తాయని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామ హైస్కూల్‌లో 47వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను బుధవారం ప్రారంభించారు. మారుమూల గ్రామమైన మంగళపల్లిలో రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామల పవన్ కుమార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ. ఉస్మాన్, చింతకాయల పుల్లయ్య, హెచ్ఎం కర్రా వీరారెడ్డి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, చింతల ముత్తయ్య, డాక్టర్ కృష్ణమాచారి, ప్రకాష్‌రావు, మునీందర్‌రావు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాల డిగ్రీ ఫైనల్ ఇయర్ ఫలితాలు విడుదల

నల్లగొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర తుది ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ బుధవారం విడుదల చేశారు. కళాశాలలో జరిగిన 2,4,6 సెమిస్టర్ల ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఫలితాలు ప్రకటించారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నియంత్రణ అధికారి జి. ఉపేందర్ పరీక్షల సరళిని సమీక్షించారు. బీబీఏ, బీకాం విభాగాల్లో 87శాతం, బీఎస్సీ(ఫిజికల్, లైఫ్‌సైన్స్) రెండో, నాలుగో సెమిస్టర్‌లో అత్యల్పంగా 17శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చివరి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థుల్లో బీబీఏ 83శాతం, బీకాంలో 80శాతం, బీఏ, లైఫ్ సైన్స్‌లో 69శాతం ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవికుమార్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి ప్రసన్నకుమార్, అధ్యాపకులు కోటయ్య, చంద్రయ్య, నాగరాజు, రమణ, బత్తిని నాగరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపిక



సాయిమాధురి

సూర్యాపేటఅర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ, ప్రేరణ స్వచ్ఛంద సంస్థ గుజరాత్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ప్రేరణోత్సవ పోటీలకు జిల్లాకేంద్రంలోని ఇమాం పేట మోడల్ స్కూల్ విద్యార్థిని అనుముల సాయి మాధురి ఎంపికైంది. నాలుగు నెలల క్రితం సూర్యా పేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో సాయి మాధురి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రేరణ ఆ సంస్థ కోఆర్డినేటర్ ప్రజాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 20మంది విద్యార్థులు ఎంపికకాగా సూర్యాపేట జిల్లాకేంద్రం నుంచి అనుముల సాయి మాధురి ఎంపికైందని ఇమాంపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజ వాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపై శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వర స్వామికి రుద్రహవనం నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 22,04,444ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్య కల్యాణాన్ని వేదపండితులు బుధవారం వైభవంగా నిర్వహించారు. రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాలు నిర్వహించారు. కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం నిర్వహించారు. పాదప్రక్షాళనం మధుపర్క పూజలు యాథావిధిగా చేపట్టారు. మంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణలు అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

పోచంపల్లిలో ఫ్యాషన్ విద్యార్థుల సందడి



చేనేత మగ్గంపై వస్త్ర తయారీని పరిశీలిస్తున్న ఫ్యాషన్ కళాశాల విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని రూట్స్ కాలేజీ ఆఫ్ ఫ్యాషన్ అండ్ ఇంటీరియల్ కాలేజీకి చెందిన 30 మంది ఫ్యాషన్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం భూదాన్‌పోచంపల్లి సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రూరల్ టూరిజం పార్కులోని చేనేత మ్యూజియంతోపాటు చేనేత కళా నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం చేనేత కార్మికుల గృహాలను సందర్శించి చేనేత ప్రక్రియను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ హబీబ్ పడాల మాట్లాడుతూ చేనేత రంగానికి సంబంధించిన స్టడీ టూర్‌లో భాగంగా పోచంపల్లిని సందర్శించామని తెలిపారు. ఇక్కడి కార్మికుల రూపొందిస్తున్న చేనేత వస్త్ర కళానైపుణ్యం అద్భుతంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఫ్యాకల్టీ మోహన్‌శ్రీ, కావ్య, అంకిత, ఉష తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు వన్‌టైమ్ ఆఫర్

భువనగిరి టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ వన్‌టైమ్ ఆఫర్ ప్రకటించింది. మూడు సంవత్సరాల డిగ్రీ (నాన్ సెమిస్టర్) కోర్సులో తప్పిన పూర్వ విద్యార్థులు మళ్లీ పరీక్ష రాసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. 2000-2015 మధ్య బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సులు చదివి పలు కారణాలతో ఫెయిల్ అయి డిగ్రీ పట్టాకు దూరమైన పూర్వ విద్యార్థుల డిగ్రీ కల నెరవేర్చేందుకు యూనివర్సిటీ మరోసారి వన్‌టైం ఛాన్స్ ఇచ్చింది. నిర్దేశిత విద్యా సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులు జూన్ 17 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని అధికారులు సూచించారు. రూ.500 అపరాధ రుసుముతో జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు ఆయా కాలేజీల్లో ఫీజు చెల్లించవచ్చు. 2015-16 విద్యా సంవత్సరం సిలబస్ ప్రకారం పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 100 మంది వరకు విద్యార్థులు ఓయూ వన్‌టైం ఛాన్స్‌కు అర్హులని డిగ్రీ కళాశాలల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఓయూ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిగ్రీ కలను నెరవేర్చుకోవాలని విద్యా వేత్తలు సూచిస్తున్నారు.

బాస్కెట్ బాల్ ఇండియా జట్టుకు విహారెడ్డి



మిర్యాలగూడ టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గారకుంటపాలెం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ విహారెడ్డి బాస్కెట్ బాల్ ఇండియా జట్టుకు ఎంపికైంది. విహారెడ్డి హైదరాబాద్‌లో పదో తరగతి చదువుతోంది. ఇటీవల అస్సోంలో జరిగిన అండర్-16 పోటీల్లో ప్రతిభ కనబర్చి ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనే ఇండియా జట్టుకు ఎంపికైంది. ఈ నెల 12 నుంచి మాల్దీవ్స్‌లో జరగనున్న బాస్కెట్‌బాల్ ఏషియన్ గేమ్స్‌లో భారత జట్టు తరుపున అండర్- 16 విభాగంలో ఆడనుంది. ఇండియా జట్టుకు ఎంపికైన విహారెడ్డిని పలువురు అభినందించారు.

యువ వికాసం కాంగ్రెస్ కార్యకర్తలకేనా : సంకినేని

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

మోత్కూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం కాంగ్రెస్ కార్యకర్తల పునరావాసానికేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు ఆర్యవైశ్య భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. కేసీఆర్ కుటుంబంలో ఆధిపత్య పోరు తీవ్రమైందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 54 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకే అత్యధికంగా ఓట్లు వచ్చాయన్నారు. దీంతో ప్రజలు ఎవరి పాలన కోరుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. 76 ఏళ్ల స్వతంత్ర భారతంలో 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ చేయనంత అభివృద్ధిని ప్రధాని మోదీ 11 ఏళ్లలో చేసి చూపారన్నారు. 15, 19 స్థానాల్లో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను 4వ స్థానానికి తీసుకెళ్లారన్నారు. ఆహార ఉత్పత్తులు, ఇతర వస్తువులు, పరికరాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయినుంచి ఆ దేశాలకు ఎగుమతి స్థాయికి తీసుకెళ్లారన్నారు. రక్షణరంగంలో తి రుగులేని పటిష్టత, బలం సాధించారన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, నియోజకవర్గ కోకన్వీనర్ కూరాకుల వెంకన్న, పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, నాయ కులు కొణతం నాగార్జునరెడ్డి, పోచం సోమయ్య, గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్‌రెడ్డి, ముత్తినేని తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ సామాజిక బాధ్యత

హెడ్‌కానిస్టేబుల్ సైదులుగౌడ్ నేత్రాలు దానం చేసిన కుటుంబసభ్యులు



సైదులుగౌడ్(ఫైల్)

కనగల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పుట్టెడు దుఃఖంలో ఉన్నా ఆ కుటుంబం సామాజిక బాధ్యత మరువలేదు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కనగల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ బొల్లపెల్లి సైదులుగౌడ్(47) నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు నల్లగొండ లయన్స్ క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్‌కు దానం చేశారు. నేత్రదానానికి సైదులు కుటుంబసభ్యులను ఎస్ఐ విష్ణుమూర్తి ఒప్పించారు. పుట్టెడు దుఃఖంలోనూ నేత్రదానానికి ఒప్పుకున్న సైదులుగౌడ్ కుటుంబసభ్యులను ఎస్ఐ ప్రశంసించారు. హెడ్‌కానిస్టేబుల్ సైదులుగౌడ్ నేత్రాలను దానం చేసి కుటుంబసభ్యులు ఆదర్శంగా నిలిచారని చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కొనియాడారు.

పాల శీతలీకరణ కేంద్రానికి తాళం

- మోత్కూరులో పాడి రైతుల ఆందోళన
- మూడు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన



మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేసి ధర్నా చేస్తున్న ముశిపట్ల పాడి రైతులు

మోత్కూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన పాడి రైతులు మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రానికి బుధవారం తాళం వేశారు. ప్రతి 15 రోజులకోసారి బిల్లు చెల్లించాల్సి ఉండగా మూడు నెలలుగా చెల్లించడం లేదని కేంద్రం ఎదుట ఆందోళన చేశారు. ఆరు బిల్లులు రూ7.20లక్షలు చెల్లించాల్సి ఉందని రైతులు చెప్పారు. పాల బిల్లు రాగానే ఇస్తామంటే తమకు దుకాణాల్లో అరువు(ఉద్దెర) కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల దాణా తెచ్చుకోవడానికి కూడా డబ్బులు లేవన్నారు. పశువులకు దాణా పెట్టకుంటే అవి పాలు ఎలా ఇస్తాయని ప్రశ్నించారు. రైతులు పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేసి ధర్నా చేస్తుండగా గ్రామాల నుంచి సేకరించిన పాలు తీసుకుని మూడు పాల వ్యాన్లు వచ్చాయి. వాటిని రైతులు లోనికి వెళ్లనివ్వలేదు. గంట సేపట్లో వాటిని కేంద్రంలో చిల్లింగ్ చేయకుంటే చెడిపోతాయని కేంద్రం సిబ్బంది బతిమిలాడినా రైతులు తాళం తీయలేదు. మేనేజర్ అందుబాటులో లేరని, తాము సమాచారం ఇచ్చామని, ఇంటి వద్ద నుంచి వస్తున్నారని సిబ్బంది తెలిపారు. వ్యాన్లు లోనికి పంపాక మళ్లీ గేటు మూసి ఆందోళన కొనసాగించారు. మేనేజర్ వచ్చి ఒక బిల్లు (15రోజులవి) ఇస్తానంటే ఒప్పుకోలేదు. రెండు రోజుల్లో ఒక నెల బిల్లు (రెండు బిల్లులు) ఇస్తానని ఆయన హామీ ఇవ్వడం, మోత్కూరు ప్రాంతానికి చెందిన మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి కూడా ఫోన్ చేసి రెండు బిల్లులు ఇప్పిస్తానని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పాల సంఘం చైర్మన్ పైళ్ల పెద్ద కవిత, వల్లపు అంతయ్య, పైళ్ల చినవెంకట్‌రెడ్డి, పైళ్ల సత్తిరెడ్డి, గనగాని నర్సింహ, పైళ్ల పాపిరెడ్డి, తండ వీరస్వామి, కందాల యాదయ్య, జిట్ట కిష్టయ్య, ముప్ప వీరారెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో మదర్‌డెయిరీ చైర్మన్, పాడి రైతు వాగ్వాదం



పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేసి రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకుని మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి రైతులకు ఫోన్ చేశారు. పాడి రైతు వల్లపు అంతయ్యను ఏం తమాషా చేస్తున్నావా అని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి దబాయించగా, నీకు చేతకాకపోతే పక్కకు తప్పుకో అంటూ రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

రాజాపేటలో పాడి రైతుల రాస్తారోకో

రాజాపేట: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం రోడ్డుపై పాడి రైతులు బుధవారం రాస్తారోకో చేశారు. లీటర్లకు రూ.4ల ఇన్సెంటివ్ చెల్లించాలని, ప్రైవేట్ డెయిరీని అరికట్టి, మదర్ డెయిరీ కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం పాలశీతలీకరణ మేనేజర్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 6న తుర్కపల్లిలో ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయనున్నట్లు పలువురు చైర్మన్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలసంఘం చైర్మన్లు సందెల భాస్కర్‌గౌడ్, రామిడి బాపురెడ్డి, చింతలపూరి వెంకటరామిరెడ్డి, శీలం మల్లారెడ్డి, ఉపేందర్, బాలరాజిరెడ్డి, భూపాల్, దశరథ, సోమయ్య పాల్గొన్నారు.



రాజాపేటలో రాస్తారోకో చేస్తున్న పాడి రైతులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కట్టంగూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆయుష్ డిస్పెన్సరీ విభాగం వైద్యాధికారి ఊర్మిళ అన్నారు. అయిటిపాములలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ అనే నినాదంతో 11వ ప్రపంచ యోగా దినోత్సవంనిర్వహించారు. ఈనెల 21 వరక యోగా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. వైద్యాధికారి ప్రణయ్, యోగా ఇన్‌స్ట్రక్టర్ శరత్ పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

మునుగోడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డీలర్లు విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ కే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని మునుగోడు ఏవో పద్మజ హెచ్చరించారు. బుధవారం స్థానిక రైతువేదికలో ఎరువులు, విత్తన దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. కల్తీ ఎరువులు, విత్తనాలను విక్రయించి రైతులను మోసం చేస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు.

మునుగోడును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మునుగోడు మండలం పులిపలుపులలో మార్నింగ్ వాక్ చేస్తూ గ్రామస్థులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దమే తన ప్రధానలక్ష్యం అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మార్నింగ్ వాక్ చేసుకుంటూ పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పులిపలుపులలో వీధులన్నీ కలియ తిరుగుతూ పారిశుధ్యం పరిశీలించారు. అనంతరం బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి పులిపలుపుల గ్రామ చెరువుకు నీరు అందించడానికి సొంత ఖర్చులతో కాలువ తవ్వించి నీటిని తరలించిన నేపథ్యంలో పెద్ద చెరువులో ఎంత మేరకు నీరు చేరుకుంది, ౨ కట్ట పటిష్టంగా ఉందా లేదా అనే విషయాలతో పాటు చెరువు అలుగును గ్రామస్థులతో కలిసి పరిశీలన చేశారు. పులిపలుపుల నుంచి బీరెల్లిగూడెం వరకు చేపట్టిన బీటీ రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించి, రోడ్డుకు చుట్టూ పక్కల ఉన్న రైతులతో మాట్లాడి రోడ్డును ప్రమాదకర మూల మలుపులు లేకుండా ఉండేలా చూడాలని రోడ్డు కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ఊకొండి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండ ఈరయ్య మృతదేహానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మర్రి మురళి, బింగి మత్స్యగిరి యువకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పాల్వాయి జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయభాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ మణిదీప్, ఎంపీవో స్వరూప, నాయకులు జాల వెంకన్నయాదవ్, చెరుపల్లి వెంకన్న, మాదగోని రాజేష్, ఎండీ రఫీక్, మేడి యాదయ్య, నడిపల్లి యాదయ్య, దేవలోకం, రుషి, పందుల అంజయ్య గోపగోని పాపయ్య, తిర్పారి అంజనేయులు, బోయపర్తి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు

● ఏర్పాట్లు పరిశీలించిన ఎస్ఐ, చైర్మన్



ఆలయ పరిసరాల పరిశీలిస్తున్న ఎస్ఐ విష్ణుమూర్తి, చైర్మన్ వెంకట్‌రెడ్డి

కనగల్, జూన్ 4,(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 7 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డితో కలిసి ఆలయ పరిసరాలను ఎస్ఐ విష్ణుమూర్తి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 6న నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఆలయం వద్ద ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. నల్లగొండ నుంచి వచ్చే వాహనాలను గుడి వెనుక గల రోడ్డు నుంచి, దేవరకొండ నుంచి వచ్చే వాహనాలను దర్వేశిపురం మీదుగా నల్లగొండకు దారి మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇతర వీఐపీలు కల్యాణంలో పాల్గొంటున్న నేపథ్యంలో వారి భద్రతకు గట్టి బందోబస్తు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

ఆర్థిక సాయం

నల్లగొండ కల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లికి చెందిన రాపోలు పరమేష్ భార్య ఇటీవల మృతి చెందింది. దీంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బట్టపోతుల సత్యనారాయణ ఆ కుటుంబానికి రూ.10 వేలు అందజేశారురు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పున్న రవీందర్, బాధితులు రాపోలు సతీష్ కుమార్, సర్వయ్య, శ్రీనివాస్, వేణు, యోగానందం, కృష్ణయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎక్కడి మురుగు అక్కడే

● కతాల్‌గూడెం అర్బన్ కాలనీలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాల్వలు ● మురుగు నీరు నిల్వతో పెరిగిన దోమల బెడద

జిల్లా కేంద్రం నల్లగొండలోని 11వ వార్డులోని కతాల్‌గూడెం అర్బన్ కాలనీలో ఇటీవల డ్రైనేజీ సీసీ కాల్వలను అస్తవ్యస్తంగా నిర్మించారు. దీంతో మురుగు నీరు నిల్వ ఉండి దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు డ్రైనేజీ సీసీ కాల్వలను ఓ డిజైన్ ప్రకారం నిర్మించనందునే ఈ సమస్యలు వచ్చాయని స్థానికులు తెలిపారు.

\- (ఆంధ్రజ్యోతి - నల్లగొండ)



అర్బన్ కాలనీలో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ కాల్వలో నిల్వ ఉన్న మురుగు నీరు

ఇళ్ల నుంచి డ్రైనేజీ కాల్వలోకి వెళ్లిన మురుగు నీరు ముందుకు కదలడం లేదు. చిన్న డ్రైనేజీలకు వెళ్లినా ప్రధాన డ్రైనేజీ (అండర్ గ్రౌండ్) పాటు ప్రధాన కాల్వలకు వెళ్లకుండా నిల్వ ఉంటున్నందున సమస్య వచ్చింది. ఇళ్ల నుంచి బయటకు వచ్చిన మురుగునీరు ఎక్కడి కక్కడ ఆగిపోతున్నందున డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు తెలిపారు. డ్రైనేజీల్లో నీరు నీరు నిల్వ ఉంటున్నందున దోమలు ఉధృతి పెరగడంతో పాటు తీవ్ర దురాస్వనతో అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే మురుగు నీటికి వరద తోడై మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇదే కాలనీలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లను నిర్మిని డ్రైనేజీ సీసీ కాల్వలను సకాలంలో అధికారులు పూర్తిచేయలేదు. ఈ కాలనీలో రోడ్డు మధ్యలో రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వాటిని తొలగగించకుండబానే సీసీ రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం విద్యుత్ స్తంభాలను తొలగిస్తే సీసీ రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉంది.



సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

మురుగునీరు సాఫీగా వెళ్లేలా చూడాలి



డ్రైనేజీ కాల్వను సక్రమంగా నిర్మించనందున నీళ్ల పోవడంలేదు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు వస్తున్నాయి. ఇళ్లలో నుంచి బయటకు వస్తున్న మురుగు నీరు తిరిగి అక్కడే ఉంటుండటం సమస్యగా మారింది. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించారు.

.● సైదమ్మ, కతాల్‌గూడెం

స్తంభాలను తొలగించాలి



విద్యుత్ స్తంభాలను తొలగించకుండా సీసీ రోడ్డునవేశారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నందునరాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా డ్రైనేజీ కాల్వలను అస్తవ్యస్తంగా నిర్మించినందున మురుగునీరు నిల్వ ఉండి దోమలు పెరిగాయి. దోమలతో రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

● సంతోషి, అర్బన్ కాలనీ

ఇబ్బందులు తొలగిస్తాం

11వ వార్డులో డ్రైనేజీ పనులతో పాటు వీధి స్తంభాలను పరిశీలించి ప్రజలు ఇబ్బందులు తొలగిస్తాం. గురువారమే శానిటేషన్ సిబ్బందిని కతాల్‌గూడెం అర్బన్ వార్డుకు పంపి సమస్యకు కారణాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటాం. డ్రైనేజీలో కాల్వల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతాం.

● రాములు, మునిసిపల్ ఈఈ నల్లగొండ

ఎస్‌ఆర్ కళాశాల విద్యార్థికి డీఐఈవో అభినందన



పవన్ అభినందిస్తున్న డీఐఈవో దస్రూ నాయక్

నల్లగొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అలిండియా స్థాయిలో 204 ర్యాంకు సాధించిన ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి సపావత్ పవన్‌ను డీఐఈవో దస్రూ నాయక్ బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కాం క్షించారు. అదేవిధంగా ఎస్‌ఆర్ అధ్యాపక బృందాన్ని కూడా అభినం దించారు.కార్యక్రమంలో ఎస్‌ఆర్ నల్లగొండ బ్రాంచీ జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ జోనల్ ఇన్‌చార్జి సతీష్ రెడ్డి, సరితా రెడ్డి, డీన్ కిషోర్ కుమార్, లెక్చరర్స్ వర్ధన్, శ్రీనివాస్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలి

శాలిగౌరారం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ శాలిగౌరారం మండల అధ్యక్షుడు రాగి రాకేష్ కుమార్ కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడం కోసం మండలంలోని పెర్కకొండారం, అంబారిపేట, మాదారం గ్రామాల్లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార జాతరలో రాకేష్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు.. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కడేరు రవికుమార్, కోశాధికారి చినేని కిషోర్, పుణ్యమూర్తి జయసాగర్, చిత్తలూరి సత్యనారాయణ, మహ్మద్ రఫీ, అల్లం శంకర్, నల్ల చక్రపాణి వివిధ గ్రామాల ఉపాధ్యాయులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



శాలిగౌరారం : మాదారంలో జీపు జాతాలో మాట్లాడుతున్న రాకేష్ కుమార్

నాంపల్లి :ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు జింకల సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాలను బుధవారం ఆయన సందర్శించి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల గురించి అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలందరిని మీ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు .కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కస్పరాజు వెంకన్న, ఉపాధ్యక్షురాలు కొండమీది కృష్ణవేణి, కోశాధికారి రాసమల్ల శ్రవణ్ కుమార్, యాదయ్య, సైదులు, రవి, వేలాద్రి, చింతపల్లి బాధ్యులు నరసింహా తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం

నల్లగొండ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కొత్తగా తెచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ హరిబాబు అన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా బుధవారం మండలంలోని అన్నెపర్తి, చర్లపల్లి, రసూల్‌పురం గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులను దరఖాస్తులను స్వీకరించారు. రైతులు తమకు భూమిపై హక్కులు కలిగిన పత్రాల తోపాటు దరఖాస్తులను అందజేయాలన్నారు. సదస్సుల్లో డిప్యూటీ తహసీల్దార్ తబితా, గౌస్, లక్తర్ అలీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులు.. 134 దరఖాస్తులు

మండలంలోని మొదటిరోజు చేపట్టిన భూభారతి సదస్సులో 163 దరఖాస్తులు రాగా, రెండోరోజు అన్నెపర్తి చర్లపల్లి, రసూల్‌పురం గ్రామాల్లో ప్రత్యే అధికారుల సమక్షంలో సదస్సులను నిర్వహించారు. ఇందుకు మొదటి రోజు 163 , రెండో రెండవ రోజు 62 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఏఏ రోజు ఏ గ్రామాల్లో అంటే..

గురువారం దండెంపల్లి, అమ్మగూడెం, వెలుగుపల్లి, 6న చందనపల్లి, తొరగల్, 9న సూరారం, అన్నారెడ్డిగూడెం, 10న ఖాజీరామారం, మేళ్లదుప్పలపల్లి, 11న పానగల్లు, జీకే అన్నారం, 12న గొల్లగూడం, నర్సింగ్‌బట్ల, 13న ఖుదావన్‌పూర్, చెన్నారం, 16న దొనకల్లు, కొత్తపల్లి, 17న దోమలపల్లి, అనంతారం, 18న కాకుల కొండారం, గుండ్లపల్లి, 19న కంచనపల్లి, బుద్దారం, మర్రిగూడెం, 20న నల్లగొం డ పట్టణంలో సదస్సులను నిర్వహించనున్నారు. ఈ సదస్సులు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు బృందాలు నిర్వహించ ను న్నారు.

● చిట్యాలరూరల్ : మండలం ఏపూర్, వనిపాకల గ్రామాల్లో తహసీల్దార్ జి. కృష్ణ, నాయబ్ తహసీల్దార్ విజయ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూముల సమస్యలున్న యజమానులు, రైతులు, హక్కుదారులు రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు అర్జీలు అందజేశారు. రెవెన్యూ రికార్డుల్లో భూమి తమ పేరిట నమోదు కాలేదని, ఉన్న భూమి విస్తీర్ణంలో తక్కువగా నమోదైనదని, పేర్లు మార్పిడి కాలేదని వీటితో పా టు పలు సమస్యలపై అర్జీలు అందజేయగా వాటికి రశీదులు ఇచ్చారు. ఏపూర్‌లో 73 అర్జీలు, వనిపాకలలో 39 అర్జీలు వచ్చాయి. సర్వేయర్ రజనీకాంత్, ఆర్‌ఐలు అమర్‌నాథ్‌రెడ్డి, జానీ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ శశిధర్, జూనియర్ అసిస్టెంట్‌లు, సిబ్బంది కృష్ణవేణి, దయాకర్, రమేష్, హరిప్రీత్‌రెడ్డి, విజయ్, ఫరీద్, నదీమ్, రైతులు, పాల్గొన్నారు.

● కట్టంగూరు : మండలంలోని రామచంద్రాపురం, ఎరసానిగూడెం గ్రామాల్లో అధికారులు రెవిన్యూ సదస్సులను నిర్వహించారు. రామచంద్రాపురం గ్రామంలో 70 దరఖాస్తులు, ఎర్రసానిగూడెంలో 32 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్బర్ట్, ఆర్ఐ ఎస్ కుమార్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది ప్రియదర్శిని, ఊర్మిళ, రవి, రఘు, సంతోష, స్వామి ఉన్నారు.



చిట్యాల : ఏపూర్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

● మర్రిగూడ : మండలంలోని కొండూరు, ఎర్రగొండపల్లి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 196మంది దరఖాస్తులు చేసుకున్నా రు. సదస్సులో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, శ్రీనివాస నాయక్, ఆకుల రఘుమయ్య ఉన్నారు.

● శాలిగౌరారం : మండలంలోని ఇటుకుల పహాడ్, వద్దిపాముల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇటుకలపహాడ్‌లో 56, వద్దిపాములలో 5 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.యాదగిరి, ఆర్‌ఐలు మహ్మద్ అజారుద్దీన్, మహ్మద్ అబ్దుల్ రఫీ, సీనియర్ అసిస్టెంట్ బి.ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

మర్రిగూడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 పాఠశాలలు పునఃప్రారంభం కాన్నునందున ప్రభుత్వం ముందస్తుగానే పాఠ్యపుస్తకాలను మండల విద్య కార్యాలయాలకు పంపించడంతో పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మండలంలో 28 పాఠశాలలో 2,079మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది విద్యార్థులకు పుస్తకాల కొరత ఉండకూడదనే ఉద్దేశంతో పాఠశాల ప్రారంభం కాకముందే పుస్తకాలను సరఫరా చేశారు. 100 శాతం పంపిణీ చేయాల్సిన పాఠ్యపుస్తకాలు కేవలం 90శాతం మాత్రమే సరఫరా చేశారు. అందులో 6 నుంచి 9వ తరగతి వరకు సంబంధించిన హిందీ పాఠ్య పుస్తకాలు అలాగే 5వ తరగతికి సంబంధించిన తెలుగు పాఠ్యపుస్తకాలు సరఫరా కాలేదు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు సరఫరా చేయనున్నట్లు ఎంఈవో బిట్టు శ్రీనివాస్ తెలిపారు.



ఎమ్మార్సీ కార్యాలయంలో పంపిణీ సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



టాలెంట్ టెస్టును అడ్డుకుంటున్న ఏబీవీపీ నాయకులు

నల్లగొండ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టాలెంట్ టెస్టుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా నాయకుడు ఆవుల సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మనోరమ హోటల్లో శ్రీ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టను ఆ సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన కార్పొరేట్ విద్యాసంస్థ ధనార్జనే ధ్యేయంగా, కాసుల కక్కుర్తి కోసం విద్యార్థులను వేధిస్తుందన్నారు. కార్యక్రమంలో శివ, సాయి పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో రేషన్ సరఫరాలో ఇబ్బందులు

మర్రిగూడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరాలో సాంకేతిక లోపంతో సర్వర్ పని చేయక పోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. వానాకాలం కావడంతో రేషన్ దుకాణాల వద్ద బియ్యం తీసుకునేటప్పుడు ప్రజలు ఇబ్బందులు పడొద్దని ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ఈనెల 1 నుంచి ప్రారంభించింది. అయితే బియ్యం పంపిణీ విషయంలో సర్వర్ పనిచేయక పోవ డంతో వేలిముద్రలు వేసే యంత్రంపై ఎక్కువ లోడ్ పడటంతో సాంకేతిక లోపం ఏర్పడి యంత్రం పనిచేయలేక పోతున్నాయి. ఒక్కొక్క లబ్ధిదారు నుంచి ఆరు సార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి ఉంది. ఒక్కొక్క లబ్ధిదారుడికి కనీసం 20 నుంచి 30 నిమిషాల వరకు సమయం పడుతోంది. దీనికి తోడు సర్వర్ అంతరాయం వల్ల వేలిముద్ర యంత్రం పనిచేయక పోవడం వల్ల దీని వల్ల లబ్ధిదారులు చౌక ధరల దుకాణాల వద్ద పడిగాపులు సాంకేతిక లోపం తరచూ అంతరాయం కలగడంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు.

చెక్‌డ్యామ్ ఇసుకపై మాఫియా కన్ను

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశానికి గండికొట్టేలా ఈ ప్రాంతంలోని ఇసుక మాఫియా రంగంలోకి దిగింది. ఈ 4 చెక్ డ్యామ్‌ల పరిధిలో నిల్వ ఉన్న ఇసుకను తరలించుకుపోయేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అధికారులపై, ఇరిగేషన్ ఇంజనీర్లపై ఒత్తిడి తెచ్చి ఈ నాలుగు ప్రాంతాల్లో నిల్వ ఉన్న సుమారు 2లక్షల క్యూబిక్‌మీటర్ల పైచిలుకు ఇసుకను అనధికారికంగా, అక్రమమార్గంలో తరలించాలని మాఫియా యత్నిస్తోంది. ఆయా గ్రామాల్లో ఉన్న కొందరిని వారి వైపునకు తిప్పుకోవడంతో పాటు, గ్రామాభివృద్ధికి కొంత విరాళం ఇస్తామని ప్రతిపాదన చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణ లక్ష్యాన్ని నీరుగార్చేలా, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా చేస్తున్న మాఫియా ప్రయత్నాలను నియంత్రించేందుకు కలెక్టర్ సహా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఇక్కడ ఇసుక తవ్వకాలను నిషేధించాలని పరీవాహక ప్రాంత రైతులు కోరుతున్నారు.

భూగర్భజలాల వృద్ధికి ..

ఇరిగేషన్‌శాఖ నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌లు వాగుకు అడ్డంగా ఆనకట్ట వేయడంతో పాటు, కట్టకు వెనకభాగంలో సుమారు కిలోమీటరన్నర వరకు వాగులో నీళ్ల నిల్వ ఉండేలా అవసరమైన మేర కాంక్రీట్ నిర్మాణం, మట్టికట్టల బలోపేతానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చెక్‌డ్యామ్‌లో భాగంగా నిర్మించే కాంక్రీట్ కట్టలను భూ ఉపరితలానికి దాదాపు 10 అడుగుల లోతువరకు తవ్వి (రాతిపొర వచ్చేంతవరకు) అక్కడ నుంచి కాంక్రీట్ నిర్మా ణం చేస్తున్నారు. చెక్‌డ్యామ్ నిర్మితమయ్యాక వాగు లో సుమారు కిలోమీటర్నర పరిధిలో భూఉపరితలం నుంచి 8 అడుగుల ఎత్తువరకు కనీసం ఇసుక నిల్వలను కొనసాగించాల్సి ఉంటుంది. అలా ఇసుక నిల్వలుంటేనే చెక్‌డ్యామ్ పరివాహక ప్రాంత పరిధిలో భూగర్భజలాలు పెరుగుతాయి. అంతేగాక వానాకాలం సీజన్‌లో వాగుకు వరదలు వచ్చినప్పుడు సై తం ఈ ఇసుక పొరలుంటే వరద ప్రవాహాన్ని కట్టడి చేయడం ద్వారా చెక్‌డ్యామ్ వద్ద వరద వేగం తగ్గడంతో పాటు, నిర్మాణం చెక్కుచెదరకుండా ఉంటుంది. ఇలా బహుళ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కనీసం కిలోమీటర్నర ప్రాంతం వరకు ఇసుక తరలించకుండా, ఇసుక నిల్వలు కనీసం 8 అడుగుల ఎత్తువరకు ఉండేలా కలెక్టర్ కట్టుదిట్టమైన ఆదేశాలు ఇవ్వాలని చెక్‌డ్యామ్‌ల పరివాహక ప్రాంతాల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ, ఏఈ వివరణ కోసం 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.



చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్న చోట్ల ఆ వాగులో

అనుముల మండలం శ్రీనాథపురం వద్ద పెద్దవాగుపై నిర్మాణంలో ఉన్న చెక్‌డ్యామ్

చికెన్ ధరలు	
లైవ్	132
డ్రెస్	192
స్కిన్‌లెస్	220
గుడ్డు డజన్	66

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	24.4

వీధి వ్యాపారులకో వీధి

● మిర్యాలగూడలో ఏర్పాటుకు ప్రయత్నాలు

వ్యాపార కేంద్రమైన మిర్యాలగూడలో రద్దీ పెరుగుతుండటంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్ని వర్గాల నుంచి సేకరించిన అభిప్రాయాల ప్రకారం పట్టణంలో వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా ఓ వీధిని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 6



యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో సిద్ధమవుతున్న సీఎం బహిరంగ సభా వేదిక

రేపు యాదాద్రి జిల్లాలో

సీఎం పర్యటన

తుర్కపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న యాదాద్రి జిల్లాలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల అనంతరం తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామంలో సభలో పాల్గొననున్నారు. అందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.1,500కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారు. భువనగిరి-గజ్వేల్ రహదారి పక్కన ఐదెకరాల విస్తీర్ణంలో సభా వేదికతోపాటు ప్రజలు కూర్చోవడానికి వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా పార్కింగ్ స్థలాలకోసం అదనంగా మరో 20ఎకరాలు కేటాయించారు. సభా ప్రాంగణానికి రెండు వైపులా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

నెల ముందుగా సాగర్‌కు కృష్ణమ్మ! 6

చెక్‌డ్యామ్ ఇసుకపై

మాఫియా కన్ను



కనగల్ మండలం బంటువారిగూడెం చెక్‌డ్యాం వద్ద ఇసుక మేటలు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

- 2లక్షల క్యూబిక్‌మీటర్ల మేర తరలించేందుకు ప్రయత్నాలు
- పెద్దవాగుపై నాలుగుచోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు
- నిర్మాణాల వద్ద 8 అడుగుల మేర ఇసుక నిల్వలు ఉండాలంటున్న నిపుణులు
- అప్పుడే భూగర్భజలాల పెరుగుదల, స్థిరత్వం
- మాఫియా యత్నాలు అడ్డుకోవాలంటున్న రైతాంగం
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని విన్నపం



నల్లగొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌ల ప్రయోజనాలకు గండి కొట్టేలా ఇసుక మాఫియా స్కెచ్ వేస్తోంది. చెక్‌డ్యామ్‌ల పరిసరాల వాగుల్లోని ఇసుక నిల్వలు తరలించుకుపోయేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇసుక మేటలు ఉన్నాయనే పేరుతో అనుమతులు తీసుకొని, వాగును జల్లెడపట్టాలని చూస్తుండటంతో చెక్‌డ్యామ్‌ల భద్రత ప్రశ్నార్థకంగా మారనుంది.

మండల స్థాయిలో అధికారులను, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, వాగులను పర్యవేక్షించే ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి భారీగా ఇసుకను తరలించేందుకు రంగం సిద్ధం చేస్తుండడంతో విషయాన్ని పసిగట్టిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలు పెంచేందుకు, అడ్డగోలు ఇసుక తవ్వకాలతో ఇప్పటికే స్వరూపం కోల్పోయిన వాగులకు పునర్జీవం పోసేందుకు ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాన్ని దెబ్బతీసేలా ఇసుక మాఫియా వ్యవహరిస్తుంటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ తక్షణమే స్పందించి చెక్‌డ్యామ్‌ల వద్ద నిర్ణీత ప్రాంతం వరకైనా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని రైతులు కోరుతున్నారు.

పెద్దవాగు, అహల్యవాగు ఇసుకకు మాఫియా స్కెచ్

కనగల్ నుంచి అనుముల మండలం మీదుగా ప్రవహించే పెద్దవాగుపై బంటువారిగూడెం, శ్రీనాథపురం, పాలెం గ్రామాల సమీపంలో మూడు చోట్ల, అనుముల మండల కేంద్ర సమీపంలోని అహల్యవాగుపై మరో చోట మొత్తం నాలుగు చెక్‌డ్యామ్‌లను ఒక్కోటి సుమారు రూ.7కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. అడ్డగోలు ఇసుక తవ్వకాలతో ఇప్పటికే స్వరూపం కోల్పోయిన వాగుకు పునర్జీవం పోయడంతోపాటు వాగు పరిసరాల్లో భూగర్భజలాలను సంరక్షించడానికి, వర్షాలు, వరదల సమయంలో నీరు ఇంకేందుకు వీలుగా ఈ చెక్‌డ్యామ్‌లను ఇరిగేషన్‌శాఖ నిర్మిస్తోంది. వాగుకు అడ్డంగా పూర్తిగా కాంక్రీట్ కట్ట వేయడంతో పాటు, కట్టకు వెనకవైపున సైతం కొంతమేర కాంక్రీట్ నిర్మాణాలు, మట్టికట్టలు నిర్మిస్తారు. ఈ చెక్‌డ్యామ్‌లు నిర్మించిన చోట వాగుల్లో కనీసం కిలోమీటరన్నర నుంచి రెండు కిలోమీటర్ల వరకు నీరు నిల్వ ఉండడమే గాక ఆ ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు నీటి వేగాన్ని నియంత్రిస్తాయి. తద్వారా నీరు వీలైనంతమేర భూమిలో ఇంకుతుంది. దీంతో వాగు పరివాహక ప్రాంతంలో భూగర్భజలాల్లో స్థిరత్వం ఉండడమేగాక వరద వృథాగా పోకుండా అడ్డుకుంటాయి. చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్న నాలుగు ప్రాంతాల్లో కనీసం కిలోమీటర్నర వరకు భూఉపరితలం నుంచి కనీసం 8 అడుగుల మేర ఇసుక నిల్వలు ఉండేలా చూడాలి. అక్కడ ఇసుక తవ్వకాలను నిషేధించాలి. అక్కడ ఇసుక నిల్వలుంటేనే వరద వచ్చినప్పుడు వేగ నియంత్రణ జరిగి చెక్‌డ్యామ్‌లకు రక్షణగా ఉంటుంది. ఇసుక నిల్వలు లేకపోతే వరద వేగానికి కట్టడాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంటుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అయితే చెక్‌డ్యామ్‌ల నిర్మాణ మిగతా 8వ పేజీలో...

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అమలులో భాగంగా అపరిష్కృతంగా ఉన్న రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని వెల్మగూడెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరై రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని మాట్లాడారు. ఈనెల 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సుల్లో సాదాబైనామా, పెండింగ్ మ్యుటేషన్‌లు, విస్తీర్ణంలో తప్పొప్పుల సవరణ, భాగా పంపిణీ తదితర సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. వెల్మగూడెంలో సుమారు 70వరకు దరఖాస్తులు వచ్చాయని, పాస్‌బుక్‌లో తప్పులుంటే సవరించుకోవచ్చని, పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని తెలిపారు. లావుని భూములకు పట్టా చేయడం కుదరదని, ప్రభుత్వ భూములు కొనుగోలు చేసిన వారికి సైతం క్రమబద్ధీకరించడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, హబీబ్‌అలీ, పాల్గొన్నారు.



వెల్మగూడెంలో రైతుల నుంచి దరఖాస్తు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దివ్యాంగులకు చికిత్స అందించాలి

నల్లగొండ టౌన్: దివ్యాంగులు, రక్తహీనత, నరాల బలహీనత సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి చికిత్స అందించేందుకు ముందుకు రావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఈసీఐఎల్‌కి చెందిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ వేణుబాబు, హెచ్‌ఆర్ మేనేజర్ దుర్గాప్రసాద్ కలెక్టర్‌ను కలిసి సామాజిక బాధ్యత కింద దివ్యాంగులకు 100 బ్యాటరీ ఆపరేటెడ్ మోటార్ సైకిళ్లు, కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్ల పంపిణీ చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. దీంతో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 52,000 మంది విభిన్న సామర్థ్యాలు (దివ్యాంగులు) కలిగిన వారు ఉన్నారని, 700 మంది చిన్నారులు మానసిక వైకల్యంతో బాధపడుతున్నారని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలతోపాటు చికిత్సకు ఈసీఐఎల్ ముందుకు రావాలని కోరారు. దేవరకొండ, మిర్యాలగూడలో మారుమూల గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని, ఇక్కడ ఎంతోమంది బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. దీంతో చీఫ్ మెడికల్ ఆఫీసర్ వేణుబాబు స్పందిస్తూ దివ్యాంగుల అవసరాలపై ప్రత్యేకంగా ప్రతిపాదనలు రూపొందించి తమకు సమర్పించాలని, రక్తహీనతను తగ్గించేందుకు బేస్ లైన్ సర్వే చేసి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. సమావేశంలో సీడీపీవో హరిత, జిల్లా సంక్షేమశాఖ కార్యాలయం ప్రోగ్రాం అధికారి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, పేపర్, వస్త్రాలతో రూపొందించిన సంచులు వినియోగించాలన్నారు. స్టీల్ బాటిళ్లు, టిఫిన్ బాక్సులు ఉపయోగించాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, పాల్గొన్నారు.

నీళ్లిచ్చి ఓట్లు అడుగుతాం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందూరు జైవీర్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నెల్లికల్ ఎత్తిపోతల పనులను పూర్తి చేసి కృష్ణపట్టి ప్రాంత రైతులకు సాగునీరందించాకే ఓట్లు అడుగుతామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నెల్లికల్ ఎత్తిపోతలతో భూములు కోల్పోయిన సుమారు 100మంది రైతులకు బుధవారం పరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లికల్ ఎత్తిపోతల పథకం జానారెడ్డి కల అని, 2013 నుంచి ఆయన దీనికోసం ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. కృష్ణా రివర్ బోర్డు నుంచి నీటి వినియోగానికి, రాష్ట్ర అటవీశాఖ అనుమతులు వచ్చేలా జానారెడ్డి కృషి చేశారన్నారు. గత రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు ఈ ఎత్తిపోతల అంశాన్ని ఓట్ల కోసమే వినియోగించుకున్నారని విమర్శించారు. సాగర్ ఉప ఎన్నికకు ముందు శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం కేసీఆర్ ఇక్కడే కుర్చీ వేసుకొని పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి ఫేజ్‌లో ఎర్రచెర్వుతండా నుంచి గోడుమడక వరకు సుమారు ఆరు గ్రామాలకు సాగునీరందించేలా నిధులను కేటాయించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ ఏర్పాటు చేసి రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు ద్వారా అర్హులుగా గుర్తించిన 5వేల మంది రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, అంగోతు భగవాన్‌నాయక్, సాగర్‌రెడ్డి, రమావత్ కృష్ణానాయక్, పమ్మి జనార్ధన్‌రెడ్డి, లాలునాయక్, బూడిద కొండలు, రమావత్ భీలునాయక్, పబ్బు గిరి, తదితరులు పాల్గొన్నారు.

కాల్వ మట్టి కాజేస్తున్నారు

- దండెంపల్లిలో మట్టి మాఫియా ఆగడాలు
- టిప్పర్లలో యథేచ్ఛగా తరలింపు

7

ఎన్జీ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల

బాస్కెట్ బాల్ జట్టుకు విహారెడ్డి 7



బేబీ వార్మర్‌లో శిశువును పరీక్షిస్తున్న వైద్యుడు రామకృష్ణ, సిబ్బంది

వసతులు పెరిగాయి..

ప్రసవాలూ పెరిగాయి

కనగల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కనగల్ పీహెచ్‌సీలో మౌలిక వసతులు పెరగడంతో సాధారణ ప్రసవాలు పెరిగాయి. గతంలో ఆస్పత్రిలో నెలకు ఒక ప్రసవం జరగ్గా, ప్రస్తుతం 10 వరకు సాధారణ ప్రసవాలు అవుతున్నాయి. కనగల్ పీహెచ్‌సీకి ప్రభుత్వం రూ.1.50కోట్లతో నూతన భవనాన్ని నిర్మించగా, మూడు నెలల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన హామీ మేరకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఆస్పత్రికి అవసరమైన ఆధునిక పరికరాలు సమకూరాయి. బేబీ వార్మర్, ఆటోక్లేవ్, ఫెటల్ డాప్లర్, నెబ్యులైజర్ తదితర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టిసారించి ఆస్పత్రికి ఫర్నిచర్, ఇతర సామగ్రి, మౌలిక వసతులను సమకూర్చారు. దీంతోపాటు జిల్లాలోనే ప్రప్రథమంగా గ్లకోమా కంటి పరీక్షల కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుచేశారు. దీంతోపాటు పీహెచ్‌సీ వైద్యుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకునేలా ప్రోత్సహించారు. పేద మహిళలు ప్రసవిస్తే వైద్యులతోపాటు, సిబ్బంది బాలింతలకు చీర, పుట్టిన శిశువుకు రెండు జతల దుస్తులు సమకూరుస్తున్నారు. ప్రసవం అనంతరం తల్లిబిడ్డను సురక్షితంగా ఆస్పత్రి నుంచి ఇంటికి చేర్చుతున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే గర్భిణుల సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కృషిని కలెక్టర్ ప్రశంసించారు.

దేశంలో ఆర్థిక అసమానతల పెరుగుదల

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మిర్యాలగూడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో రోజురోజుకూ ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మండల పరిధిలోని యాద్గార్‌పల్లిలో జరిగిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో పాలకులు అనుసరిస్తున్న అసమగ్ర విధానాలతో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయన్నారు. పేదరికం పెరిగి చాలామంది జీవించే హక్కును కోల్పోతున్నారని అన్నారు. అధికారం కోసం పాకులాడే పాలకవర్గాలు ధనిక, సంపన్న వర్గాల మెప్పు పొందేందుకు ప్రజా సంపదను దోచిపెడుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలిచ్చి, సహజ వనరుల దోపిడీకి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని విమర్శించారు. పేదలు ఎర్రజెండా నీడన సంఘటితమవుతున్నారని అన్నారు. అసమానతలు లేని సమాజం కోసం, దోపిడి, పీడనలు లేని సమసమాజం కోసం పేదలు ఎర్రజెండాను ఎత్తి పట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండి.సయీద్, దామరచర్ల, వేములపల్లి మండలాల కార్యదర్శులు లింగానాయక్, జిల్లా యాదయ్య, బిళ్ల కనకయ్య, బంటు రాజేశ్వరీ, రామలింగం, జి.యాదగిరి, పద్మ, శాంత, వలపట్ల వెంకన్న, మట్టయ్య, ముత్తు, జగన్, సైదమ్మ, రమేష్, రాములు, మార్తమ్మ, అనిత, లక్ష్మి, ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

● జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గాలికి వది రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పాకులాడుతున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం మత విద్వేషాలను సృష్టిస్తోందని ఆరోపించారు. కశ్మీర్‌లో పర్యటకులపై దాడి చేసి 27 మందిని చంపిన నలుగురు ఉగ్రవాదులను ఇంతవరకు పట్టుకోలేదని విమర్శించారు. దేశ ప్రజలంతా యుద్ధం కోరుకుంటుంటే ట్రంప్ చెప్పాడని యుద్ధాన్ని ఆపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. యుద్ధంపై అఖిలపక్షం సమావేశం నిర్వహించాలన్నారు. ఎన్నికల ముందు ఆరు పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లో ఎవరికి వారే వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యలపై ఎర్రజెండా ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు పాలడుగు నాగార్జున, డబ్బికార్ మల్లేష్, నారి ఐలయ్య, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



సమాశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బీసీలు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాడాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లు ప్రకటించాకే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. అనంతరం ఎస్‌బీఐ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్‌వీటీని బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నూనె వెంకటేష్, అబ్దుల్లా, ఖాదర్‌బాబా, లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

దామరచర్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా 25శాతం సీట్లు కేటాయించాలని టీఆర్‌జీఎస్ జిల్లా అధ్యక్షుడు ధీరావత్ శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గణేష్, తరుణ్, లక్ష్మణ్, రమేష్, సైదా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా దేప సుదర్శన్‌రెడ్డి

దేవరకొండ, జూన్4(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో బుధవారం నిర్వహించిన సీపీఐ మండల సమావేశంలో ఆ పార్టీ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా నూనె రామస్వామితోపాటు 32 మంది కౌన్సిల్‌సభ్యులు, 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



భీమనపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మాడ్గులపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠకు బుధవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో గ్రామంలో బొడ్రాయి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగా బొడ్రాయి ప్రతిష్ఠకు భూమి పూజ చేశామన్నారు. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కూడా తోడ్పాటును అందిస్తుందన్నారు. ఆయన వెంట నాయకులు కొండేటి జలంధర్, విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదులు కుటుంబానికి పరామర్శ

మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన బొల్లెపల్లి సైదులు మృతి చెందారు. దీంతో ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బుధవారం సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం సైదులు అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. ఆయన వెంట భూపతి ఉషయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

పెండ్లిపాకల రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్4(ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ ఓపెన్ కెనాల్, పెండ్లిపాకల ప్రాజెక్టు ఎత్తుపెంపు నిర్మాణ పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. అలాగే రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డిని ఎమ్మెల్యే వేర్వేరుగా శాలువాతో సన్మానించారు. డిప్యూటీ సీఎం, మంత్రి సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

చింతపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రజలు సహకరించాలని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని కుర్మపల్లికి చెం దిన సంకోజు ఎల్లప్ప, ఆచారి ఇంటి స్థలం కోసం తరచూ గొడవ పడుతూ ఇటీవల డీఎల్‌పీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఎల్పీవో శంకర్‌నాయక్ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇద్దరికి నచ్చజెప్పి గొడవ చేసుకోవడం సమస్యలు పరిష్కారం కావని చెప్పారు. భూమిని ఇద్దరు పారదర్శకంగా తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో రవి, కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి

చింతపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీతోనే దేశం అన్నీ రంగాల్లో ప్రగతి సాధిస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడిగా సముద్రాల నగేష్, ఉపాధ్యక్షుడిగా గొట్టే పర్వతాలు, కేతావత్ సుభాష్, కుంచరాపు క్రాంతిరెడ్డి, శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా వెన్నం శేఖర్, గొడుగు సీనయ్య, కార్యదర్శిగా మదారం శ్రీరాములు, కోశాధికారిగా పున్న లావణ్యను ఏకగ్రీవంగా నియమించారు. ఈ మేరకు నియమాక పత్రాన్ని నగేష్‌కు అందించారు.

పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ

వేములపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా మానవ మనుగడ కొనసాగుతుందని జేవీవీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రావులపెంట గ్రామంలో ఉపాధి కూలీలకు పర్యావరణ పరిరక్షణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తపై వివరించారు. కార్యక్రమంలో పాదూరి రమణారెడ్డి, గుత్తికొండ సుదర్శన్, వల్లపుదాసు సతీష్, మహేష్ పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం

వేములపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన జెర్రిపోతుల నాగరాజు అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులకు బుధవారం పలువురు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన భవాని తాపి సెంట్రింగ్ యూనియన్ తరుపున రూ.11,516 అందజేయగా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి రూ.6వేల అందించడంతో పాటు దహన సంస్కారాల అనంతరం వారి కుటుంబసభ్యులకు ఎన్ఎస్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే కాసు సంధ్యారెడ్డి సైతం రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కత్తి జానయ్య, కొమ్మనబోయిన ఆంజనేయులు, ఎల్లబోయిన లింగయ్య, అర్జున్, రమణయ్య, రమేష్, రవి, సైదులు, కరుణాకర్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యే మురుగు



వేంకటేశ్వరనగర్ ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు

చింతపల్లి మండలంలోని 34 గ్రామపంచాయతీల్లో పూర్తిస్థాయిలో మురుగు కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గొడకొండ్ల వెంకటేశ్వర నగర్, ఎం.మల్లేపల్లి, కుర్మపల్లి, కిష్టారాయినిపల్లి, తదితర గ్రామాల్లో ఇళ్ల మధ్య మురుగునీరు నెలల తరబడి నిల్వ ఉంటుంది. దీంతో దుర్వాసన వస్తుంది. కాల్వల్లో పందులు, కుక్కలతో పాటు, ఈగలు, దోమలు ప్రబలి రోగాల బారిన పడుతున్నారు. ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు క్షేత్రసాయిలో పరిశీలించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. (ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

రహదారి ఇలా..వెళ్లేదేలా..



వీ.టీ.నగర్‌లో ధ్వంసమైన సీసీ రహదారి

చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర(మాల్)లో నాగార్జున బ్యాంకు వెళ్లే రహదారి ప్రమాదకంగా మారింది. రహదారి మధ్యలో మురుగు కాల్వపై సిమెంట్ దిమ్మె శిథిలావస్థకు మారింది. గతంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సిమెంట్ దిమ్మె నిర్మించారు. నిత్యం బ్యాంకుతో పాటు, జడ్పీహెచ్ఎస్ వాహనదారులు వందల సంఖ్యలో రాకపోకలు ప్రయాణం చేస్తున్నారు. దీంతో కాల్వపై కప్పుభాగం కోతకు గురై రహదారి ప్రమాదకరంగా మారింది. అధికారులు చొరవ చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. (ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

వననర్సరీలో మొక్కలేవీ?



చెన్నంనేనిపల్లి వన నర్సరీలో కవర్లలో మొక్కలు

రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం నిర్వహించనున్నది. ఇందుకు వన నర్సరీలో పంపిణీకి మొక్కలను సిద్ధం చేయాల్సిన ఉంది. చాలా వరకు కవర్లలో మట్టి తప్ప మొక్కలు కనిపించడం లేదు. మండలంలోని 26 గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన వన నర్సరీలలో చాలా వరకు ఇదే పరిస్థితి ఉంది. మండలంలోని చెన్నంనేనిపల్లి గ్రామపంచాయతీలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కవర్లు ఇలా మట్టితో తప్ప మొక్కలు లేకుండా దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వనమహోత్సవం నాటికి మొక్కలను అందుబాటులో ఉంచాలని మండల వాసులు కోరుతున్నారు. (ఆంధ్రజ్యోతి-కొండమల్లేపల్లి)

భూభారతి చట్టంతో రైతుల భూములకు భద్రత



దామరచర్ల : నర్సాపురం సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



నేరేడుగొమ్ము మండలం కేతేపల్లి రెవెన్యూ సదస్సులో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి

దామరచర్ల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని నర్సాపురం గ్రామంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూభారతి చట్టంతో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ధరణి పోర్టల్ వల్ల అనేక అక్రమాలు జరిగాయని, రైతులకు న్యాయం జరగలేదని అన్నారు. కార్యక్రమంలో అధికారులు,నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● దేవరకొండ (నేరేడుగొమ్ము), చందంపేట, డిండి : భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా బుధవారం నేరేడుగొమ్ము మండలం కేతేపల్లి, చందంపేట మండలం గుంటిపల్లి, డిండి మండలం ఖానాపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తులన్నీ పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నేరేడుగొమ్ము మండలం కేతేపల్లి భూభారతి గ్రామసభలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధరణిలో పరిష్కారం కాని భూసమస్యలు కూడా ఈ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూసమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకునే సమయంలో రైతులు దరఖాస్తుకు పాత పట్టాదార్ పాస్‌పుస్తకంతోపాటు కొత్త పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు తప్పనిసరిగా జతచేయాలని కోరారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఖానాపూర్ గ్రామంలో 44 దరఖాస్తులు, కందుకూరు గ్రామంలో భూసమస్యల పరిష్కారం కోసం 148 దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమాల్లో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, నేరేడుగొమ్ము, డిండి తహసీలార్లు ఉమాదేవి, అంబటి ఆంజనేయులు, డిప్యూటి తహసీల్దార్ గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● దేవరకొండ : మండలంలోని తాటికోలు, ఇద్దంపల్లి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తాటికోలులో 140 దరఖాస్తులురాగా అందులో మిస్సింగ్ సర్వేనెంబర్‌లు 65, అసైన్డ్ భూమికి సంబంధించి 57, విస్తరణ సవరణ 14, వారసత్వ మార్పుకు సంబంధించి 4 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఇద్దంపల్లి గ్రామంలో కూడ 24 మిస్సింగ్ సర్వేనెంబర్‌లు మార్పు చేయాలని అత్యధికంగా దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సు లో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, కార్యదర్శి మూర్తి,పాల్గొన్నారు.

● చింతపల్లి : మండలంలోని కొక్కిరాలగౌరారం, పీ.కే.మల్లేపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు ఈ రెండు గ్రామాల నుంచి 68 దరఖాస్తులు స్వీరించారు. కార్యక్రమాల్లో ఆర్డీవో రమణారెడ్డి చింతపల్లి తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఆర్ఐ సునీత, ప్రశాంత్ పాల్గొన్నారు.

● వేములపల్లి :మండలంలోని అన్నపరెడ్డిగూడెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు కార్యక్రమంలో తహసీల్దార్ హేమలత, డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, ఆర్‌ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, జూనియర్ అసిస్టెంట్ సరిత, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

డిండి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీరపల్లి రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోపా, డ్రాఫ్‌మెన్‌సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, స్టెనోగ్రఫీ, వెల్డర్‌తోపాటు కొత్త అడ్వాన్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సులు మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, ఇండస్ట్రీయల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్(మెకానికల్), ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్, అడ్వాన్స్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నిషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్, వెహికిల్ ట్రేడర్లలో మొదటి విడత సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 14 ఏళ్ల వయస్సు పైబడినవారు ఈనెల 21వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఎస్‌సీ మెమో, 4 నుంచి 10 తరగతి వరకు బొనోఫైడ్, కుల ధ్రువీకరణ పత్రాలు, ఈ-మెయిల్ ఐడీ, సెల్ నంబర్, ఫొటోతో ఇంటర్నెట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునే ముందు 10వ తరగతి మార్కుల జాబితాలో నమోదైన పుట్టిన తేదీకి ఆధార్‌కార్డులో ఉన్న పుట్టినతేదీ సరిపడాలని తెలిపారు.

చంద్రబాబు విమర్శించే అర్హత ఎమ్మెల్సీ కవితకు లేదు : టీడీపీ

మిర్యాలగూడ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత ఎమ్మెల్సీ కవితకు లేదని టీడీపీ మండలాధ్యక్షుడు చిలుకల వెంకన్న అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. మచ్చలేని మహానాయకుడైన చంద్రబాబును లిక్కర్ కేసులో జైలు కెళ్లి వచ్చిన కవిత విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రముఖులను విమర్శిస్తే గుర్తింపు పొందొచ్చని, జనాల దృష్టిలో పడొచ్చని అకారణంగా విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. ఏపీలో జగన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు నోరు మెదపని కవిత, హరీష్‌రావు ఇప్పుడు ఎలా విమర్శిస్తున్నారని ప్రశ్నించారు.

నేడు వాసవీ ఆలయ వార్షికోత్సవం

కొండమల్లేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సముద్రాల గణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి: కమిషనర్



ఈద్గాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. బక్రీద్ సందర్భంగా బంగారుగడ్డలోని ఈద్గాను బుధవారం ఆయన పరిశీలించారు. అనం తరం మాట్లాడుతూ పట్టణంలోని మసీదులు, ఈద్గాల పరిసరాల్లోపారిశుధ్య ఏర్పాట్లను చేయిస్తున్నట్లు తెలిపారు. ఖుర్బానీ చేసే తరుణంలో ముస్లింలు వ్యర్థాలను వీధుల్లో వేయరాదని, అందుబాటులో ఉంచిన మునిసిపల్ వాహనాలలో వేయాలని కోరారు. పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి తమ సిబ్బందికి అందించాలన్నా రు. ప్రజలందరి సహకారంతోనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ఆయన వెంట టీపీఎస్ కట్టెబోయిన అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, మైనార్టీ నాయకులు మాజీద్, సీమఖాద్రి, బాబా తదితరులున్నారు.

రావి నారాయణరెడ్డి ఆశయాలను సాధిద్దాం

దేవరకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ దివంగత రావి నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహరెడ్డి అన్నారు. బుధవారం రావి నారాయణరెడ్డి 118వ జయంతిని పురస్కరించుకొని దేవరకొండ సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. రైతాంగ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి అగ్రభాగాన ఉండి పోరాటం చేశాడన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా పోటీ చేసి దేశ మొదటి ప్రధాని నెహ్రూను మించిన ఓట్లు సాధించిన ఘనత రావి నారాయణరెడ్డికే దక్కిందన్నారు. రావి నారాయణరెడ్డిని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్య దర్శి పల్లె నర్సింహ, సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, నూనె రామస్వామి, ఆంజనేయులు, యాసాని పాండురంగారెడ్డి, వెంకట్రాములు, జ్యోతిబసు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పల్లా నర్సింహరెడ్డి

జంగయ్య సేవలు చిరస్మరణీయం : మాజీ ఎమ్మెల్యే



జంగయ్య స్థూపానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు.

చింతపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు కొలుకులపల్లి జంగయ్య పార్టీ చేసిన సేవలు చిరస్మరణీయమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. బుధవారం జంగయ్య 9వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆయన స్థూపానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ జంగయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ నెల 9న సీపీఐ ఆధ్వర్యంలో వెంకటేశ్వరనగర్‌లో నిర్వహించే మహాసభను విజయవంతం చే యాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, కొలుకులపల్లి కొండల్, గుండ్లపల్లి రాము లు, శంషుద్దీన్, జావీద్, అలీ, జలాల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బడిబాట కరపత్రాల ఆవిష్కరణ

త్రిపురారం జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపు కోసం ప్రచురించిన బడిబాట కరపత్రాలను మాజీ జడ్పీటీసీ ధనావత్ భారతీ భాస్కర్ నాయక్ ఆవిష్కరించారు. మండలంలోని చెన్నాయిపాలెం ఉన్నత పాఠశాల ఆధ్వర్యంల బుధవారం వస్రాంతండా, లక్పత్తితండా, నడిమితండా, చౌళ్లతండా, సత్యంపాడ్ గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ధనావత్ భాస్కర్‌నాయక్, హెచ్ఎం ఉమ్మడి సైదిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ ఇసుకపై మాఫియా కన్ను

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశానికి గండికొట్టేలా ఈ ప్రాంతంలోని ఇసుక మాఫియా రంగంలోకి దిగింది. ఈ 4 చెక్‌డ్యామ్‌ల పరిధిలో నిల్వ ఉన్న ఇసుకను తరలించుకుపోయేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అధికారులపై, ఇరిగేషన్ ఇంజనీర్లపై ఒత్తిడి తెచ్చి ఈ నాలుగు ప్రాంతాల్లో నిల్వ ఉన్న సుమారు 2లక్షల క్యూబిక్‌మీటర్ల పైచిలుకు ఇసుకను అనధికారికంగా, అక్రమమార్గంలో తరలించాలని మాఫియా యత్నిస్తోంది. ఆయా గ్రామాల్లో ఉన్న కొందరిని వారి వైపునకు తిప్పుకోవడంతో పాటు, గ్రామాభివృద్ధికి కొంత విరాళం ఇస్తామని ప్రతిపాదన చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణ లక్ష్యాన్ని నీరుగార్చేలా, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా చేస్తున్న మాఫియా ప్రయత్నాలను నియంత్రించేందుకు కలెక్టర్ సహా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఇక్కడ ఇసుక తవ్వకాలను నిషేధించాలని పరీవాహక ప్రాంత రైతులు కోరుతున్నారు.

భూగర్భజలాల వృద్ధికి ..

ఇరిగేషన్‌శాఖ నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌లు వాగుకు అడ్డంగా ఆనకట్ట వేయడంతో పాటు, కట్టకు వెనకభాగంలో సుమారు కిలోమీటరన్నర వరకు వాగులో నీళ్ల నిల్వ ఉండేలా అవసరమైన మేర కాంక్రీట్ నిర్మాణం, మట్టికట్టల బలోపేతానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చెక్‌డ్యామ్‌లో భాగంగా నిర్మించే కాం క్రీట్ కట్టలను భూ ఉపరితలానికి దాదాపు 10 అడుగుల లోతువరకు తవ్వి (రాతిపొర వచ్చేంతవరకు) అక్కడ నుంచి కాంక్రీట్ నిర్మా ణం చేస్తున్నారు. చెక్‌డ్యామ్ నిర్మితమయ్యాక వాగులో సుమారు కిలోమీటర్నర పరిధిలో భూఉపరితలం నుంచి 8 అడుగుల ఎత్తువరకు కనీసం ఇసుక నిల్వలను కొనసాగించాల్సి ఉం టుంది. అలా ఇసుక నిల్వలుంటేనే చెక్‌డ్యామ్ పరివాహక ప్రాంత పరిధిలో భూగర్భజలాలు పెరుగుతాయి. అంతేగాక వానాకాలం సీజన్‌లో వాగుకు వరదలు వచ్చినప్పుడు సైతం ఈ ఇసుక పొరలుంటే వరద ప్రవాహాన్ని కట్టడి చేయడం ద్వారా చెక్‌డ్యామ్ వద్ద వరద వేగం తగ్గడంతో పాటు, నిర్మాణం చెక్కుచెదరకుండా ఉంటుంది. ఇలా బహుళ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్న చోట్ల ఆ వాగులో కనీసం కిలోమీటర్నర ప్రాంతం వరకు ఇసుక తరలించకుండా, ఇసుక నిల్వలు కనీసం 8 అడుగుల ఎత్తువరకు ఉండేలా కలెక్టర్ కట్టుదిట్టమైన ఆదేశాలు ఇవ్వాలని చెక్‌డ్యామ్‌ల పరివాహక ప్రాంతాల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ, ఏఈ వివరణ కోసం 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.



అనుముల మండలం శ్రీనాథపురం వద్ద పెద్దవాగుపై నిర్మాణంలో ఉన్న చెక్‌డ్యామ్

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : భైరవం / వెంకటేశ్వర: ఖలేజా, ఏస్ / రాఘవ: ఖలేజా, కరాగే కిడ్ లెజెండ్ / విక్రోస్: ఖలేజా, భైరవం, దేవరకొండ : మనోజ్ : భైరవం / మైత్రి వెంకటేశ్వర : కరాటే కిడ్